# వకుళ భూషణ నాయకి

(నమ్మాళ్వారుల జీవితము)



కె. టి. యల్. నరసింహాచార్యులు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# వకుళభూషణ నాయకి

## (నమ్మాళ్వారుల జీవితము)

రచయిత

కె. టి. యల్. నరసింహాచార్యులు

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2009

# VAKULABHUSHANA NAYAKI

**(Biography of Nammalvar)**

*By*

**K.T.L. NARASIMHACHARYULU**

*Edited by*
D. Nagasidda Reddy

© All Rights Reserved

T.T.D.Religious Publications Series No. 410

First Edition : 1992

Re-print : 2009

Copies : 2000

*Published by*

**K.V.Ramanachary I.A.S.,**
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

*Printed at*

Tirumala Tirupati Devasthanams Press
Tirupati.

# ముందుమాట

విశిష్టాద్వైత మతవిశ్వాసాలకు బహుళవ్యాప్తిని కలిగించిన మహాపురుషులు ఆళ్వారులు. కలియుగారంభంలో జన్మించి శ్రీ వైష్ణవ సంప్రదాయానికి మూలపురుషులైన ఈ దివ్యసూరులు 12 మంది. ఆళ్వార్ అంటే రక్షించేవాడు లేక భగవంతుడి భక్తిరసప్రవాహంలో మునిగినవాడు అని అర్థం. వర్ణాశ్రమభేదాల్ని పాటించని ఈ మహాత్ములు భగవంతుని సాక్షాత్కారంకోసం తహతహలాడి పారవశ్యంతో తమిళ భాషలో గానం చేసిన రచనలే దివ్యప్రబంధాలని ప్రఖ్యాతి వహించాయి

దివ్యప్రబంధాలు 24. వీటిలోని పాశురాల సంఖ్య 4 వేలు. ద్రావిడ పద్యాల్ని పాశురాలని పిలుస్తారు. నాలాయిర దివ్యప్రబంధమని (చతుస్సాహస్రి) దీనికి వ్యవహారనామం. ఈ దివ్యప్రబంధాలకు దాక్షిణాత్య శ్రీ వైష్ణవులు వేదప్రామాణ్యాన్ని ఇస్తారు. అసామాన్యమైన భగవంతుడి దివ్య సౌందర్యాన్ని దర్శించడంలో కల్గిన మహానందాన్ని ఇతరులకు సంక్రమింపజేయడం వీరి పరమాశయం. అంతరంగశుద్ధి, శీలం పరమాత్ముడి అనుగ్రహప్రాప్తికి మూలమని ఈ మహాయోగుల అభిప్రాయం.

పన్నెండుమంది ఆళ్వారులలో నమ్మాళ్వార్ ఒకరు. ఈయన ఉడయనంగై, (నాథనాయిక) కారి అను దంపతులకు శ్రీ మన్నారాయణుని సేనాపతి అయిన విష్వక్సేనుడి అంశంలో జన్మించిన మహనీయుడు. దక్షిణదేశంలో తామ్రపర్ణీనదీ తీరంలోని కురుకాపురికి కారి ప్రభువు. నమ్మాళ్వారుకు తల్లిదండ్రులు పెట్టినపేరు మారన్. శఠకోపన్, పరాంకుశన్, వకుళాభరణన్ మున్నగుపేర్లతో కూడ

ఈయన వ్యవహరించబడుతున్నారు. భగవంతుడే స్వయంగా ఈ మహాత్ముడికి తన మెడలోని వకుళమాలను బహూకరించడం వల్ల నమ్మాళ్వారుకు వకుళభూషణ నామం సిద్ధించిందని విజ్ఞుల మాట. తనను నాయికగా భావించుకొని పురుషోత్తముడి పొందుకోసం పరితపించిన ఈ యోగి పుంగవుడు రచించిన "ప్రబంధ చతుష్కం" లోని పద్యసంఖ్య 1296. 1102 పాశురాలు కల్గిన "తిరువాయ్‌మొళి" ఈ 'ప్రబంధచతుష్కం'లో ఒకటి.

శ్రీమాన్ కె.టి.యల్. నరసింహాచార్యుల వారీ శఠకోప యతీంద్రుని జీవితాన్ని, కవితా వైభవాన్ని వారిచ్చిన సందేశాన్ని లలితమైన భాషలో రచించి తిరుమల తిరుపతి దేవస్థానములకు సమర్పించారు. ఉత్తమ గ్రంథ ప్రచురణ ప్రచారాల ద్వారా ఆర్ష సంస్కృతి ప్రాశస్త్యాన్ని ప్రజలలో వ్యాప్తి పొందించడమే ధ్యేయంగా కలిగిన తిరుమల తిరుపతి దేవస్థానములవారు ఈ గ్రంథాన్ని ముద్రించి జనావళికి అందజేస్తున్నారు. సహృదయ పాఠకులు మా కృషికి చేయూతనిస్తారని మా విశ్వాసం.

**కార్యనిర్వహణాధికారి**
**తిరుమల తిరుపతి దేవస్థానములు.**

# గురుదక్షిణ

శ్రీ యజ్ఞమూర్తి వంశీయులైన ఉ. వే. ప్ర. శ్రీమదిత్యాది శ్రీమాన్ కాండూరి రంగాచార్యులుగారు, తూర్పుగోదావరి జిల్లా కొత్త లంక నివాసులు. మంత్రమంత్రార్థాదులు, శ్రీ భాష్య భగవద్విషయా దులు సేవింపగోరి శిష్యులు తమ్మాహ్వానింపగా మద్రాసున కాపురముపెట్టి సర్వులకును విశిష్టాద్వైత సిద్ధాంతదీక్ష పెట్టినారు. అనేక సంస్కృత విద్యార్థులకు భోజనాది సౌకర్యములతోబాటు సంస్కృత విద్యాదానము గూడ చేసి యథార్థాచార్యులైనారు. సుమా దరువది వత్సరములకు పూర్వము వారు మా తండ్రిగారగు శ్రీమదిత్యాది శ్రీమాన్ కాండూరి తిరుమల జగన్నాథాచార్యులుగారి వంశపారంపర్య సత్సంప్రదాయములను పురస్కరించుకొని మా అక్కగారు శ్రీమతి ల.స. వేంకటరాఘవమ్మ గారిని తమ కోడలినిగా చేసుకొన్నారు. అంతేగాదు, మాతండ్రిగారిని సకుటుంబముగా మద్రాసుకు పిలిపించి భోజనాది సౌకర్యము లుచితముగా కల్పించి, శ్రీభాష్య భగవద్విషయాదులు వారి కనుగ్రహించినారు.

అదే సంప్రదాయమును కొనసాగింప దలంపుకొని "పితుః శత గుణం పుత్రః" అను రీతిగా మా బావగారు ఉ. వే. ప్ర. శ్రీమాన్ అ.తి. కాండూరి వేంకట తాతాచార్యులుగారు విద్యార్థినయిన నన్ను కాంచీపురమునకు పిలిపించుకొని కంటికి రెప్పవలె కాచి సంస్కృత వ్యాక రణ సాహిత్య పాఠములతో నన్ను మనీషిని గావించుటకు పాటుపడినారు. వారు పెట్టిన విద్యాభిక్షయే న న్నింతవానినిగా చేసినది. మా అక్కగారు పరమపదించినను నేటికిని వారు నన్ను పుత్రనిర్విశేషముగనే చూచుకొనుచున్నారు.

శరీరబంధమునుమించిన మా యీ యుభయుల

గురుశిష్యసంబంధమును పురస్కరించుకొని

దానికి చిహ్నముగా

"వకుళ భూషణ నాయకి"
అను నా యీ యక్షరలఘుకృతిని
గురుదక్షిణగా
నిండు భక్తిప్రపత్తులతో - కృతజ్ఞతతో
తిరుమలై కాందూరి వేంకట తాతాచార్యులుగారికి
సమర్పించుకొనుచున్నాను.

మునునూరు,
విరోధికృత్. ఉగాది

కె.టి.యల్. నరసింహాచార్యులు



# విషయ సూచిక


| | |
|---|---|
| భగవద్గుణానుభవము | 1 |
| అవతరణము | 8 |
| మధుర కవి | 13 |
| ఆగమావతరణము | 16 |
| కవితా వైభవము | 23 |
| వకుళభూషణనాయకి | 30 |
| సందేశము | 36 |
| కణ్ణినుణ్ శిరుత్తాంబు | 41 |
| విష్ణుసాయుజ్యము | 44 |
| అమృత పానము | 45 |

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీమతే శఠకోపాయ నమః

# భగవద్గుణానుభవము

శ్రీరంగదేశికకటాక్ష వివృద్ధబోధం
శ్రీనారసింహగురువర్య కృపైకపాత్రమ్,
హారీతవంశ్య మనవద్యగుణై రుపేతం
శ్రీలోకనాథగురువర్య మహం భజామి.

శ్రీమాన్ వేంకటతాతార్యో వైయాకరణకేసరీ,
అస్మద్దేశికవర్యో మే సన్నిధత్తాం సదా హృది.

యో నిత్య మచ్యుతపదాంబుజయుగ్మరుక్మ
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే,
అస్మద్గురో ర్భగవతోఽస్య దయైకసింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే.

యత్పాదపద్మప్రావణ్యా దభవం జ్ఞానలేశవాన్,
వందే తం విష్ణుభక్తాగ్ర్యం వకుళాభరణం మునిమ్.

యద్గోసహస్ర మపహంతి తమాంసి పుంసాం
నారాయణో వసతి యత్ర సశంఖచక్రః,
యన్మండలం శ్రుతిగతం ప్రణమంతి విప్రాః
తస్మై నమో వకుళభూషణభాస్కరాయ.

ఏరి శ్రీముఖసూక్తి యింపారుశైలి మానవుల పాపపటలిని మాయఁజేయు
నే మహాత్ము హృదబ్జంబు నెప్పుడు విడఁడొ, శంఖచక్రాదిధరుఁడయి సతము విష్ణుఁ
డెవని విగ్రహమండలిఁ బెల్లద్విజులు వేదగతమునుదర్శించి విన్నుతిసేతు
రట్టి వకుళాభరణమార్యు నార్తితోడ, వందనముజేతు నే నిదె భక్తిమీఱ!

త్రివిధతాపపరితప్తులగు జీవులకు భక్తియొక్కటే అమృతసేకము వలె ఐహికాధ్యాత్మికశాంతి కలిగించు రసాయనము. దీనినే హరిభక్తాగ్రేసరులు శ్రీ కులశేఖరాళ్వారులు ముకుందమాలలో నిట్లు వర్ణించినారు.

"ఇదం శరీరం పరిణామపేశలం పత త్యవశ్యం శ్లథసంధిజర్జరం,
కి మౌషధైః క్లిశ్యసి మూఢ దుర్మతే నిరామయం కృష్ణరసాయనం పిబ."

ఈ శరీరము నశ్వరము. సంధిబంధములు సడలి యిది యెప్పుడో రాలిపోక తప్పదు. కాన నో దుర్మతి! మందులతో ధనమును, కాలమును, ఆరోగ్యమును ఎందుకు వమ్ము చేసుకొందువు? సంతతా రోగ్యప్రదమై కాయకల్ప చికిత్సతో నెనయగు శ్రీకృష్ణరసాయనమును సేవింపుము.

భగవంతుని గూర్చిన ప్రేమయే భక్తి. తైలధారవలె నవిచ్ఛిన్న ముగా ప్రవహించు భావధారయే భక్తి! దేవునియెడ ననన్యప్రేమయే భక్తి! శ్రియఃపతికల్యాణగుణచేష్టితములును తద్దివ్య మంగళవిగ్రహసౌం దర్యమును హృదయదఘ్నముగా అతృప్తామృతమువలె ననుభవించుటయే భక్తి!

కొండలపై వర్షముకురియుటచే చిన్నచిన్న జాలులుగా బైలుదేరిన నదులు పోను పోను వృద్ధిచెంది పల్లమునకు ప్రవహించి చివరకు సముద్రమున కలియును. కాని భక్తినది విషయము మాత్రము పై న్యాయమునకు భిన్నమయినది. ఇది దక్షిణమున ద్రావిడకవుల వాణినుండి నిసర్గసుందరముగ వెలువడి అయత్నముగనే ఉత్తరదిక్కునకు ప్రవహించుచు కొండలెక్కి బండలు దిగి ఆ దిశ కవధియగు పరమ పదమున విరాజిల్లు పరతత్త్వము శ్రీమన్నారాయణునం దైక్యమందును. ఆకసమునుండి కురిసిన వర్షము సముద్రమున లీనమగుచుండగా మర్త్య లోకమునుండి వెలువడిన యీ భక్తినది మాత్రము సర్వలోకోపరిస్థితు

డగు శ్రీహరి యను మహాసముద్రమున నైక్యమగును. ఇది యెంత చిత్రము! ఈ సూక్తి సత్యమే గదా!

"ఆకాశాత్పతితం తోయం యథా గచ్ఛతి సాగరమ్,
సర్వదేవనమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి."

భగవత్తత్త్వమునకును ప్రకృతికిని - విద్యకును అవిద్యకును - క్షరమునకును అక్షరమునకు - భేదముగాని రహస్యముగాని యందే కలవు. ఈ గీతాసూక్తి మననీయము.

ఊర్ధ్వమూలం మధశ్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్,
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్.

ఇందక్షరతత్త్వము విలక్షణమయిన అశ్వత్థవృక్షములో పోల్చబడినది. ఇతరవృక్షములవలెగాక నీ రావిచెట్టు తలక్రిందుగా వ్రేలాడుచుండును. దాని మొద లూర్ధ్వముఖము, కొమ్మలు క్రిందకు వ్రాలియుండును. దాని యాకులే వేదములు. ఆ వృక్షతత్త్వయే బ్రహ్మతత్త్వవేత్త.

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ,
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః.

మన రాత్రి యా బ్రహ్మవేత్తకు పగలు. వాని పగలు మనకు రాత్రి. అట్టివాడే భగవంతుని లీలసౌందర్యము నాస్వాదింప నర్హుడు.

కలియుగాదిని అనగా నేటి కైదువేలవత్సరములకు పూర్వము శ్రీ వైష్ణవసంప్రదాయమునకు – దీనినే శ్రీ భాగవతసంప్రదాయమనిగూడ నందురు – మూలపురుషులగు పన్నిద్దరాళ్వారు లవతరించినారు. వీరిని గూర్చి 'సాహితీసమరాంగణసార్వభౌముడు', 'కవితా ప్రావీణ్య ఫణీశుడు' అగు శ్రీకృష్ణదేవరాయల సూక్తి యిది –

అం పన్నిద్దఱుసూరులందును సముద్యల్లీలఁ గావున్న లి
గ్గరికం దానముఁబావ నా నిజమనఃకంజాతసంజాత పు
ష్కలమాధ్వీకరుచి స్మరారి సాగియుంగా ఔక్క ధన్యాత్ములౌ
నిం పన్నిద్దఱుసూరులం దలఁతు మోక్షేచ్ఛామతిం దివ్యులన్.

ముముక్షువు - అనగా మోక్షార్థియయినవాడు - అందును విష్ణుభక్తుడు — ఈ ఆళ్వారులను గూర్చి వీరి భక్తితత్త్వమునుగూర్చి తెలిసికొనక తప్పదు. ఆలకింపు డీ శ్లోకము —

భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీభక్తిసార కులశేఖర యోగివాహాన్,
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్రమిశ్రాన్
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోఽస్మి నిత్యమ్.

ఈ శ్లోకమున పదకొండుగురు ఆళ్వార్ల పేర్లు గలవు.

(1) పొయ్‌గై ఆళ్వార్ (2) పూదత్తాళ్వార్ (3) పేయాళ్వార్ (4) పెరియాళ్వార్ (5) తిరుమళిశై ఆళ్వార్ (6) కులశేఖరాళ్వార్ (7) తిరుప్పాణాళ్వార్ (8) తొండరడిప్పొడి యాళ్వార్ (9) తిరుమంగై ఆళ్వార్ (10) ఉడైయవర్ (11) నమ్మాళ్వార్. వీరిలో ఉడైయవర్లను తీసివేయగా మిగిలినవారికి పదుగు రాళ్వార్లు అనిగూడ వ్యవహారము కలదు. ఈ పదకొండుగురకు ఆండాళ్‌ను గూడ కలిపిన పన్నిద్దరాళ్వార్లు అగుదురు. సుప్రసిద్ధ భగవద్రామానుజులే ఉడైయవర్లు: గోదాదేవి లేక ఆముక్తమాల్యదయే ఆండాళ్:

భగవద్గుణానుభవము నిరర్గళముగా స్రవింగవలె వీరి వాక్కులనుండి ద్రావిడభాషారూపమున వెలువడినందున వీరికి ఆళ్వార్లు అని పేరు గలిగినది. ఆళ్వార్ అనిన కాపాడువారు అని వ్యుత్పత్తి. కవితాసుందరి వలచివచ్చి వీరి వాక్కులను వరించినది. తమ కవితతో వీరు మనను

లను కాపాడుట కవతరించినారు. ఉదాహరణ కీ ప్రధములరచనలు పరిశీలింపుడు.

వైయం తకళియా వార్కమే నెయ్యాక.
వెయ్యకదిరోన్ విళక్కాక చెయ్య
శుడరాళియానడిక్కే శూట్టినేన్ శొన్మాలై,
ఇడరాళినీంగు కవే యెన్ఱు.

— పొయ్‌గై ఆళ్వార్.

భూమిని ప్రమిదగాచేసి పారుచున్న సముద్రమును నేతియందిడు ఉష్ణకిరణుడగు సూర్యుని వత్తిగా వేసిన దీపముతో దుఃఖసముద్రము నుండి బైటపడగోరి సుదర్శనచక్రాయుధుడగు శ్రీమహావిష్ణువుపాదములం గీవాక్మాలను సమర్పించుచున్నానని ఒకరుపల్కగా మరొకరా శ్రీపతి నిట్లు నుతించినారు –

అన్బే తకళియా ఆర్వమే నెయ్యాక
ఇన్బురుకు శిందై యిడుతిరియా-నన్బురుకి
జ్ఞానచ్చుడర్ విళక్కేత్తినేన్ నారణఱ్కు,
జ్ఞానత్తమిళ్ పురిందనాన్.

— పూదత్తాళ్వార్.

భక్తినే ప్రమిదగా - ఆర్తినే నేయిగా - ఆనందముచే కరగిన మనస్సునే వత్తిగా - వేసి, అజ్ఞానాంధకారము పటాపంచలగునట్లు పరభక్తియను నుజ్జ్వల దీపమును భగవంతునకు సమర్పించితిని.

నమ్మాళ్వారులు శరీరము, ఇతరులు వారికి కరపాదాద్యవయువ ములు. కాననే వకుళభూషణులను ప్రసిద్ధ నామముగల యీ నమ్మా ళ్వారులనే విష్ణుభక్తి నది కుద్గమస్థానముగా మన పూర్వాచార్యులు వర్ణించియున్నారు. ఈ కవిబ్రహ్మ మహాముని. మహర్షి మహాభాగవ

తోత్తములు. వీరి ఘనతను ప్రసిద్ధ వైష్ణవ సంప్రదాయ ప్రబంధము 'ఆచార్యసూక్తిముక్తావళి' యిట్లు నిబంధించినది.

వ. "శ్రీశజలధిసుస్థిరకృపాసలిలంబు
గ్రోలి శఠారాతి కాలఘనము
నాథమునీంద్రుండ నగముపై వర్షింప
నది రామపుండరీకాక్షులనెడు
ఝరముల యామునాచార్యమహానదిఁ
జేరించి పొరలియుబ్బిన యతీంద్ర
పద్మాకరేంద్రంబుఁ బరిపూర్ణ మొనరింప;
దేశికాగ్రములు దిశలయందుఁ
బ్రాణిసస్యంబులన్నియుఁ బ్రబలుమీలఁ
జాలఁబ్రవహించుచున్నది సరసులార!
నమ్మయాళ్వారు నెమ్మది నమ్ముఁడమమ
వాదిభీకరగురుఁడన మోదమలర"

శ్రీహరి యను సాగరమందలి కృపామృతము (జలము) గ్రోలెను వకుళభూషణ మునియను మేఘరాజు. నాథముని యను పర్వతముపై నా మబ్బు వర్షఋతువున కురిసెను. ఆ వర్ష జలము రామమిశ్ర పుండరీకాక్షులను రెండు సరస్సుల గుండ పారి యామునాచార్యులను మహానదికి వరద కల్గించెను. ఆ వరద వెల్లువలో శ్రీరామానుజులను సరస్సు నిండెను. పూర్వాచార్యులను మేఘములు ఆ జలమును కదు పునిండుగా గ్రోలి ప్రాణులను సస్యములు నవనవలాడుచుండగా చక్కగా నే డన్నిఋతువులందును వర్షించుచున్నవి. అట్టి నమ్మాళ్వారులను నీల మేఘమే భవదవాగ్నిదగ్ధులగు బద్ధజీవులకు శరణ్యము:

విష్ణ్వాలయముల కేగినపు డచటి యర్చకులు తీర్థమిచ్చి శఠకోప మును మన శిరస్సులపై నుంతురుగదా: నమ్మాళ్వారులకే శఠకోపులని

కూడ నామాంతరము. ఆ శఠకోపుల ప్రతీకమే యీ శఠకోపము. శఠకోపులు శ్రీమహావిష్ణువునకు పాదస్థానీయులు. శఠకోపముపై విష్ణుపాదములుండుట మనము శ్రద్ధగా గమనించిన చూడగలము. విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకులగు నా శఠకోపులకు శ్రీ. భగవద్రామానుజాచార్యులవారు పాదస్థానీయులు.

విష్ణుపదములనుండి గంగానది యుద్భవించినట్లే ఈ శఠకోపముని వాక్కునుండి వెలువడిన పదజాలమునుండి శఠకోపగీతామృతము లేక సహస్రగీతి అని పేరు గాంచిన ఈ తిరువాయ్‌మొళి అను ద్రావిడ వేదసాగర మవతరించినది. కాననే యీ ప్రపన్నజనకూటస్థులు భగవదనుభవపరీవాహరూపమగు భక్తిస్రవంతికి ఉద్గమస్థానమగు మహాశైలరాజముగా వినుతికెక్కినారు. ఈయన మూర్తీభవించిన కరుణారసము. చెరుదారులలో కన్నుగానక పయనించి నరకకూపమునబడువారి నుద్ధరించి నూతకోల. భగవద్గుణానుభవామృతరూపమగు నీ దివ్యప్రబంధమును గూర్చిన యీ ప్రశంస నాలకింపుడు.

భక్తామృతం విశ్వజనానుమోదనం
సర్వార్థదం శ్రీశఠకోపవాఙ్మయం
సహస్రశాఖోపనిషత్సమాగమం
నమామ్యహం ద్రావిడవేదసాగరమ్.

ఈ శఠకోప వాఙ్మయము విష్ణుభక్తుల పాలిటి కమృతము. విశ్వజనుల కాస్వాద్యము. అర్థులకు కొంగు బంగారము. సహస్రశాఖలుగా ప్రవహించు నుపనిషత్తు లను నదీమతల్లులకు గమ్యస్థానము. ఇట్టి ఈ ద్రావిడవేదమున కంజలించి మనమిక కథానాయకుని పుణ్యకథామృతము గ్రోలుటకు ముందుకు సాగుదమా?

# అవతరణము

**వృషభే తు విశాఖాయాం కురుకాపురి కారిజమ్,**
**పాండ్యే దేశే కలే రాదౌ శఠారిం సైన్యపం భజే.**

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడగు శ్రీమన్నారాయణుడు విరజానదీతీరమున వైకుంఠనగరమున విరాజిల్లియుండెను. దానినే పర మపద మని సూరు లందురు. గురూపదేశ మను నావచే సంసార సాగరమును తరించిన ముక్తులు మాత్రమే ఆయనను చేరి సేవించు భాగ్యమున కర్హులు.

ఆ స్వామి యొకనాడు శ్రీ భూ నీళాపట్టమహిషీ సేవ్యమా నుడై శంఖచక్రాద్యాయుధధరుడై అనంతగరుడవిష్వక్సేనాది పరివారప రివేష్టితుడై పేరోలగముండెను. కాని ఆయన ముఖపద్మముమాత్ర మేలనో షన్నెదరిగి చిన్నవోయి యుండెను. భూలోకవాసులు తానిచ్చిన కరచరణాద్యవయవములను తన సేవ కుపయోగింపక వానిని దుర్విషయ ముల కధీనము చేసి మోక్షమార్గవిముఖులగుటయే తదీయ మనోవైకల్య కారణము.

“అయ్యో, ఈ జీవకోటి యిట్లు దుర్మార్గమున నడచుచున్నదే: వీరి నెట్లు సన్మార్గుల జేయుట? బిడ్డ లిట్లు చెడిపోవుచుండుట చూచి యే తండ్రి యయినను సహింపగలడా! వీరిని బాగుచేయు నుపాయ మేదియో గదా!”

అని ఈ రీతిగ మనమున ఘనముగా పనవుచున్న యా శ్రీపతి మనోభావముగుర్తించి యాయన కత్యంతాత్మీయుడును సర్వసేనాపతి యగు విష్వక్సేనుడు నిటలతటఘటితాంజలియై యిట్లు విన్నవించెను. “ప్రభూ! ఈ దాసానుదాసుడు మీ యానతి నెట్టిదానినయినను నిర్వర్తిం

చుటకు సిద్ధముగా నుండగా మీ కీ విచారమేల? సందియ మందనేల! మీ చింతను దూరము చేయుటకు త్రికరణశుద్ధిగా ప్రయత్నింతును."

"ఏమి చెప్పుదును సేనేశా! భూలోకవాసులకు నా సాయుజ్య ముమ చేరుటకు తగిన మార్గముల ననేకరీతులుగా చూపియున్నాను. శ్రీరామకృష్ణాద్యనేకావతారములు ధరించి భువిపై నవతరించి లోకసం గ్రహపరతంత్రుడనై వారికి కర్తవ్య ముపదేశించినాను. మహర్షులద్వారా వేదశాస్త్ర పురాణాదులను ప్రచారముచేయించినాను. ఇన్ని చేసినను వారు దుర్మదాంధులై తెలివిమీరి చెడుదారులబడి పయనించుచున్నారు. వారిని బాగుచేయుటకు నీవే సమర్థుడవు. దీన్కి తగిన యవసర ముగూడ నిపుడు కలిగినది. దక్షిణభారతమున కురుకాపుర నరపతి కారి, పుత్రునకై నన్నర్థించినాడు. కాన నా కారి దంపతులకు పుత్రుడ వయి జన్మించి ద్రవిడభాషలో నా గుణగణములు గానము చేసి దానిని ప్రపన్న పరిగ్రహణయోగ్యముగా చేయుటకు పూనుకొమ్ము. సర్వలోకోపకారకమగు నీ మహాకార్యనిర్వహణమునకు నీవే తగుదువు" అని శ్రీ మహావిష్ణువు మనసులోని వెతను విష్వక్సేనునకు తెలిపి తన హృదయభారము నుపశమింప జేసుకొనెను.

"ఇంత మాత్రమునకే మీ రింత విచారింపవలెనా? ఇదే మీ యాజ్ఞనౌదల దాల్చి యిపుడే భూలోకమున కేగుచున్నాను. సెల విందు" అని విష్వక్సేనుడు పలికి వెంటనే యందుకు తగిన సన్నాహ ములు చేయసాగెను. అనంతరము వినతాసుతవాహనుడగు నా శ్రియఃపతి తనకు శయ్యాసనములుగా నుపయోగించు నాదిశేషునితో "ఓయీ విష్వక్సేనుడు కురుకాపురమున యోగమార్గరతుడగుటకు వీలుగా నీవు ముందుగా నచటి కేగి నా దేవాలయ ప్రాకారాంతరమున చింతచెట్టువై వర్ధిల్లుము" అని యాదేశించెను. ఆదిశేషుడును చిత్తమని పలికి తన స్వామి యాదేశము నౌదల దాల్చి బయలువెడలెను.

కురుకాపురి దక్షిణదేశమున పాండ్యమండలమున విరాజిల్లుచున్నది. దాని నిప్పుడు ఆల్వార్ తిరునగరి అని వ్యవహరించుచున్నారు. భోగభాగ్య సమృద్ధితో పూర్వమా నగర మలకానగరమునుగూడ తలదన్నుచుండెను. ఆ పురవరమున కధిపతి కారియను పేరు గల నరపతి. ఆ రాజు పరిపాలనలో నా మండల మీతిబాధారహితమై నెలకు మూడువానలు నిండుగా గురియుగా శోభిల్లుచుండెను.

తన్నగరవాసులందరు నానందసముద్రమున నోలలాడుచుండగా నా జనపతిహృదయసదనము మాత్రము విచారమునకే నిలయమయ్యెను. కుల వర్ధనుండగు కొడుకును గనజాలనందుకే యాతని కట్టి పరితాపము! దానితో నాతనికి రాచకార్యములు సరిగా నిర్వహించుకొనుట గూడ నశక్యమయ్యెను. నిద్రాహారములే కరువయ్యెను.

నాధనాయిక యను స్త్రీ రత్న మా భూపతికి సహధర్మచారిణి. పతికి తగిన సతియని యెల్లర నుతులందుకొన్న దా సతీతిలకము! అట్టి యనుకూలవతి నిల్లాలుగ బడసి గూడ నాతని హృదయము సుతసంత తతి హీనతచే వెతగుందుట మానలేదయ్యెను.

చింతాశల్యమునకు చిక్కి సుతముఖకమలావలోకమునకై తహతహలా డుచున్న యాతనికి మంత్రిసామంతాదు లొకనా డిట్లు నివేదించిరి. – "ప్రభూ! కరుణావరుణాలయుడును నాశ్రితమందారమునగు వాదినాథ దేవుడు తలచుకొన్నచో మీకు సంతతికల్గుట యేమి లెక్క! ఆయనను ప్రార్థించిన మీ కోరిక తప్పక యీడేరును. కాన వెంటనే యా స్వామి కోవెలకు బైలుదేరుడు."

వారి యీసూచనమేరకు కారివరుడు నారీమణి నాధనాయిక తన్న నుసరింపగా హరిసన్నిధి కేగి నతులతో నుతులతో నాతని బలురీతుల బొగడి పుత్రసంతాన మనుగ్రహింపుమని ప్రార్థించెను. శ్రీ మహావిష్ణు

వాతనియెడ ప్రసన్నుడై "ఓయీ నాయంశమున నీకు పుత్రుడుదయించును, నీ వింక చింతను వీడి నిశ్చింతగానుండుము." అని అర్చకముఖముననను్రగహించెను.

పరమపదనాథుని కృపాలేశముచే నా కారిదంపతులకు సుతలాభమనుగ్రహించుటకును ద్రావిడవేదప్రాశస్త్యమును ధరణిపై వ్యాపింపజేయుటకును నంతకుముందే ప్రతిన బూనిన ముకుందుని సేనాపతి విష్వక్సేను డా కారిరాజువలన నాథనాయికాగర్భమున ప్రవేశించెను. ఆమె గర్భము దినదినప్రవర్ధమానమయ్యెను. నవమాసములు నిండగా కలియుగాదిని నలుబది నాల్గవ దినమున సుమా రయిదువేల సంవత్సరములకు పూర్వము, ప్రమాది వత్సర వైశాఖ శుక్ల చతుర్దశినాడు విశాఖా నక్షత్ర యుక్త కటకలగ్నమున రూపసౌందర్యములచే మారుని మించిన యొక కుమారు డా దంపతుల కుదయించెను. చంద్రోదయమున కెదురుచూచుచున్న సముద్రమువలె నున్న యా దంపతుల హృదయము పుత్ర సందర్శనముచే నానందడోలికల నూగులాడెను. మించు దీవనుబోలె మిలమిల మెరయుచున్న యా పట్టిని గాంచిన కారి సంభ్రమానందాశ్చర్యములు ముప్పిరిగొనగా నొడలుమరచి భూసురులకు భూరి దక్షిణాదుల నొసగెను. యధావిధిగా జాతకర్మ మొనర్చి రూపజితమారుడగు నా కుమారునకు మారుడని సార్థకనామ మిడెను.

కాని సకలజగత్తులోని యజ్ఞానాంధకారమును తొలగించుట కవతరించిన యా బాలునిలో ప్రాకృతశిశుచేష్టలు మాత్రము కానుపింపలేదు. అందుకా తలిదండ్రులు మిగుల వగల బొగిలిరి. అది సహజమే కదా! అతడు కనులు తెరువడు. ఏడుపసలే లేదు. స్తన్యపానాదు లంతకంటె కోరడు. ఇటు నటు చలింపడు కూడ. మలమూత్రవిసర్జన మొదలే లేదు! అయినను ఆ బాలుని శరీరము మాత్రము బాల సూర్యునివలె దినదినమునకును నప్రాకృత తేజస్సుతో ప్రకాశించుచు వృద్ధి పొందసాగెను. ఆ బాలు నే యోగశక్తి వరించినదో గదా!

ముఖ్యముగా నాథనాయిక తన కుమారుని గాంచి పడిన పరితాప మున కంతులేదు."అయ్యో! బిడ్డకై మేము మొగమువాచి ప్రార్థింపగా నిట్టివానిని దైవము మా కనుగ్రహించుటకు మే మేమి పాపము చేసి నామో? ఇట్టి బాలుని చూచి నా గుండె పగులకున్నదేల" అని యామె విలపించుచుండగా వారి యెడ ప్రసన్నుడై యాదినాథుడు కరుణించి యా దంపతుల కిట్లానతిచ్చెను. "పరమ భాగవతోత్తములారా? మీరు ధన్యులు. కాననే జగత్తులోని యజ్ఞానాంధకారము దూరముచేయునట్టి పుత్రుడు మీ కుద్భవించినాడు. ఈతని భారము నాపై నిడి నిశ్చిం తగా మీ ఇంటి కేగుడు. ఈత డెట్టి ఘనకార్యము లొనర్చునో మీరే చూచి యానందింపగలరు!"

"విధివిలాస మవిలంఘనీయము. దైవమిచ్చిన బాలు నా దైవము నకే సమర్పింతము. తానిచ్చిన బిడ్డను తానే కాపాడుకొనుగాక" యని నిశ్చయించి యా దంపతు లా బాలు నా యాలయ ప్రాంగణమున నున్న చింతచెట్టు వద్దకు కొనిపోయిరి. బంగరు గొలుసులతో తూగుటు య్యెల నొకదాని నా చెట్టు కొమ్మలకు కట్టించిరి. పీతాంబరములతో పీతాంబరునివలె నొప్పు నా బాలు నందు పరుండజేసి దుఃఖభారముతో గుండియలు వ్రీల వెనుదిరిగి చూడకుండగనే నిజ నివాసము నెట్లో చేరిరి.

ఆ దంపతు లటు వెడలగనే యా బిడ్డడు కేసరికిశోరమువలె నా తొట్టెనుండి లంఘించి చింతచెట్టు తొఱ్ఱను ప్రవేశించెను. సహస్ర సూర్య ప్రభాభాసమానమగు నాతని ముఖమండలము జ్ఞానప్రభలచే వెలుగొందుచుండెను. వైకుంఠనాథుని యాజ్ఞచే విష్వక్సేను డాత నికి పంచసంస్కారముల ననుగ్రహించెను. బద్ధ పద్మాసనస్థుడై యా బాలయోగి పద్మదళాక్షుడగు రమాపతినే తన హృదయపద్మమున నిలిపి సదా ధ్యానింప తొడగెను. మౌనియై ధ్యానస్తిమితలోచనుడై, అష్టాంగ

యోగమున నా యరవిందదళాయతాక్షుని దివ్యమంగళవిగ్రహ సౌంద ర్యమును, అతని కళ్యాణగుణ చేష్టితములను అనుభవించుచు పదునారు సంవత్సరములు గడచెను. శ్రీనారాయణపాదపద్మయుగళీచింతామృ తాస్వాదమత్తచిత్తుడగు నా యోగి కిహలోక ప్రసక్తియే లేకపోయెను. కారి కుమారుడయినందున కారిమారులని పరమతస్థుల కంకుశప్రాయుడ గుటచే పరాంకుశులని, భక్తి పరిపూర్ణుడయి నందున నమ్మాళ్వారులని ఆయనకు నామము లొప్పెను.

అతని యనన్య భక్తి ప్రపత్తుల కానందమంది యాదినాథదేవు డాతనికి తాను ధరించిన వకుళమాలికను - పొగడ పూలదండను - అర్చక ద్వారమున ననుగ్రహించెను. దానిని ధరించిన యా యోగివరు డలౌకికమహిమాన్వితుడును దివ్యతేజస్సంపన్నుడునయ్యెను. వకుళమాలా ధారియునగుటచే నాయన వకుళభూషణుడు గూడనయ్యెను.

## మధుర కవి

చైత్రే చిత్రా సముద్భూతం పాండ్యదేశే గణాంశజమ్,
శ్రీపరాంకుశసద్భక్తం మధురం కవి మాశ్రయే.
హస్తస్థతాళ ద్వితయం ప్రపద్యే
శఠారివాగ్వ్యాస ముదారకీర్తిం
మాధుర్యసంశ్లిష్టకవిత్వయుక్తం
మహత్త్వసంభావిత భక్తితత్త్వం.

కురుకాపురికి సమీపమున తిరుక్కోవలూరను దివ్యదేశము కలదు. అందు నారాణుడను బ్రాహ్మణోత్తముడు వర్ణాశ్రమాచార ధర్మముల నేమరక శ్రీహరిభక్తితో కాలము గడుపుచుండెను. ఆ మహనీయునకు కుముదుడను సేనేశుని యంశచే నొక కుమారుడు వకుళభూషణభా స్కరునకు ముందరుణనివలె నుదయించెను. ఆ బాలు డుపనీతుడై

సకలవిద్యలు సర్వశాస్త్రములు బాల్యముననే యభ్యసించెను. భక్తిజ్ఞాన వైరాగ్యసంపన్నుడగుటయే కాక త్రిమూర్త్యాత్మకుడగు శ్రీ మన్నారాయణునిపై మధురమగు కవితను చెప్పగలిగినందున మధురకవి యను నామముతో వ్యవహరింపబడుచుండెను. ఒక్క కవిత్వమే కాదు, అతని గుణగణములు, ప్రవర్తనాదులు అన్నియు మధురమే యయినందున అతని కాపేరు సర్వథా చరితార్థమయ్యెను.

భాగవతచూడామణియగు నా ద్విజోత్తముడు దివ్యతీర్థ సందర్శనాభిలాషియై యుత్తరదేశమునకై బయలు వెడలెను. మాయాద్వారకావంతి కాశీకురుక్షేత్రగయాప్రయాగాదులను దర్శించి బదరీనాథుని సేవింపనరిగెను. ఆ స్వామి సేవలో కొంతకాలము చక్కగా గడపి తిరుగు ప్రయాణమున నయోధ్య చేరెను. శ్రీరామచంద్రుడు లక్ష్మణాదిసోదర మేతుడై నడయాడిన ప్రదేశము లట కన్నులపండువుగా దర్శించి యా వైష్ణవోత్తము డమందానందకందళితహృదయారవిందు డయ్యెను. ఒక నాటి రాత్రి యాతని కొక దివ్యతేజము తూర్పు దిక్కున కంటబడెను. 'అది దావాగ్నియా, కాకున్న నా తేజస్సుయొక్క స్వరూపస్వభావ మెట్టిదై యుండనోపును!' అని యాతనికి సందియ ముదయించెను. మరునాటిరాత్రి గూడ నా తేజస్సా దిక్కున్నే తోచినందున దాని మూలము తెలిసికొన వేడుకపడి మధురకవి కాలినడకను బైలు దేరెను. మార్గమధ్యమున నున్న తీర్థములను దర్శించుచు నిను మయస్కాంతము చేతవలె బలముగా నాకర్షింపబడి పగలు ప్రయాణించుచు రాత్రులందా తేజమును చూచుచు క్రమముగా కొంతకాలమునకు కురుకాపురి చేరెను. ఆ పట్నముగూడ దాటిపోగా నాతని కిక నా తేజస్సు దృష్టిగోచరము కాలేదు. అప్పడాత డా జ్యోతికి మూలతత్త్వ మానగరముననే యుండునని నిర్ణయించుకొనెను.

మరల నా నగరమున కాయన వెనుదిరిగి వచ్చెను. అచట వకుళ భూషణముని దివ్యచేష్టితములను గూర్చిన గాథ లాయన చెవిని బడెను.

వెంటనే యా మహాకవి యాదినాథ స్వామి కోవెల కరిగి ఆదిశేషునిపై శ్రీమహావిష్ణువునుబోలి చింతచెట్టుతొఱ్ఱలో విలసిల్లుచు రూప సౌందర్యములచే కందర్పుని దర్పమునుగూడ హరించుచున్న శఠకోప యోగీంద్రుని దర్శించెను. ద్వాదశాదిత్యులు నేకమై యీ వకుళభూషణభాస్కరుని యందు వెలుగొందుచున్నారు యనునట్లు ద్వాదశోర్ధ్వపుండ్రములతో కన్నులపండువు చేయుచున్న యాయనను దర్శింపగనే మధురకవి వెంటనే హర్షపులకితాంగుడై సాష్టాంగదండప్రణామ మాచరించెను.

నిమీలితలోచనుడగు నా శఠకోపు నెదుటకేగి మధురకవి కరతాళ ధ్వని చేసెను. వెంటనే యా యోగి కన్నులు కొద్దిగా తెరచి మరల మూసుకొనెను. మధురకవి యాయనను "ప్రకృతి కడుపున బుట్టిన జీవు డేమి తిని యెట్లు బ్రతుకును?" అని ప్రశ్నించెను. "దానిని తిని యట్లే బ్రతుకు" నని యా ముని వాక్కునుండి సమాధానము వచ్చెను. తన సమస్యకు భావపూర్ణమయిన యట్టి సమాధానమిచ్చినవాడు సామాన్యమానవుడు కాడని, గొప్ప తత్త్వవేత్తయని యాతడు దృఢపరచుకొనెను. వెంటనే యా యోగిపుంగవు నెడ భక్తి శ్రద్ధలు ద్విగుణీకృతమాయెను.

రెట్టించిన భక్తి ప్రపత్తులను మకరందముతో నిండిన తన హృత్పద్మమును మధురకవీంద్రు డా యోగీంద్రునకు సమర్పించి వినయ వినమితోత్తమాంగుడై కృతాంజలియై యిట్లు విన్నవించెను –

"స్వామీ! నేటికి మీ దర్శనముచే నా జన్మము ధన్యమయినది. కాని భవదవాగ్నిదగ్ధుడనగు నేను కడతేరుమార్గము కూడ నాకు మీరు చూపక తప్పదు. ఇక మీ పాదారవిందములే నాకు శరణ్యము. మీరే నాకు దైవము." ఇట్లు పలికి తనను గట్టిగా శరణుజొచ్చిన యాశిష్యసత్తముని నమ్మాళ్వారు లవ్యాజ కటాక్షముతో తనయంత వానినిగా చేయుటకు దృఢ నిశ్చయులైరి. ముక్తి నొసగు సులభోపాయ మా

మౌనివరు డాయన కుపదేశింపదలచెను. శ్రీ పరాంకుశకృషీవలుడు సారవంతమగు నా భక్తకవి మానసక్షేత్రమును తన సదుపదేశహలముతో దున్ని జ్ఞానబీజము లచట నాటెను. ఆ యుపదేశసారమిది:

చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు అని మూలతత్త్వములు మూడు. చిత్తు అనగా జీవుడు. అచిత్తు అనగా ప్రకృతి. ఈ రెంటికి అధిపతియయిన వాడే ఈశ్వరుడు. అతడు సర్వస్వతంత్రుడు. జీవుల కాతనిసేవయే ప్రధాన కర్తవ్యము. ముక్తిమార్గములగు కర్మజ్ఞానభక్తిప్రపత్తులలో చివరిదే భగవంతునిచేర్పు సులభోపాయము. అదియే ప్రశస్తతమము గూడ. సదాచార్యుని సమాశ్రయించి తద్ద్వార యీశ్వరునందు తన భార మర్పించుటయే ప్రపత్తి. ప్రపత్తిచేత సర్వజనులకు పరమపదలాభము తథ్యము.

వకుళభూషణముని నాటిన యీ యుపదేశబీజము మధురకవి యాళ్వారుల మానసక్షేత్రమున వెంటనే యంకురించి తీగెలుసాగెను. తర్వాత మొగ్గతొడిగి పూలుపూచి ఫలించెను.

## ఆగమావతరణము

"వేదము వేదమే: ద్రవిడవేదము వేదమవం ప్రబంధమున్
వేదసమూహసారమును వేదశిరోర్థరూపకంబు లో
కాదరభాజనంబగు సముచితకావ్యమునమ్మె నిట్లు గా
నేది కొఱంత? యిది పఠియించినవారికి శ్రీపరాంకుశా!"

-- శ్రీపరాంకుశ శతకము

శ్రీ వకుళభూషణులు నిర్హేతుకభగవత్కృపాలబ్ధమయిన కవితాప రిమళమును తన యెదలో దాచుకొనలేకపోయిరి. దాని నా మహర్షి దుర్విషయాసక్తులై తమ సృష్టికర్తయగు పరమేశ్వరుని చేరజాలని ప్రజా సామాన్యము నుద్ధరించుటకెట్లు వినియోగించెనో ముందు ముందు తెలిసికొందము.

క్రమముగా నాయనలో పరభక్తి పరజ్ఞాన పరమభక్తులు వృద్ధిచెంద సాగెను. దైవదర్శన కాంక్షయే పరభక్తి. తత్సంగమకాంక్ష పరజ్ఞానము. సంగమము కల్గిన తర్వాత తన స్వామిని వదల నిచ్ఛగించలేకపోవుటయే పరమభక్తి. చంద్రునికై చకోరమువలె భగవత్సంయోగమునకై యా భక్తుడు మిగుల తహతహ జెందసాగెను. దానికై యాయన తనపై నాయికాభావము నారోపించుకొన్నాడని గూడ మనము ముందు తెలిసికొనగలము.

అనన్యవిరహపీడితుడగు నా భక్తవరుని యార్తికి ప్రీతుడై శ్రీహరి గరుడవాహనారూఢుడై నీలమేఘనిభాకారముతో పీతాంబరము మిగుల శోభిల్లుచుండగా శంఖచక్రాదుల ధరించి, శ్రీభూనీళలు తన్ను కొలుచుచుండగా నమ్మాళ్వారులకు ప్రత్యక్ష మయ్యెను. వెంటనే శఠకోపులానంద పారవశ్యముచే నొడలు మరచిపోయిరి. కొంతవడి కెట్టకేలకు తెలివినంది పరబ్రహ్మసందర్శనానందముచే కనులనుండి ముక్తాఫలముల వలె నానందబాష్పములు కురియగా నిట్లా యోగివరుడు తలపోసెను. "ఆహా, ఏమి నా భాగ్యము. నేటికి స్వామి ప్రత్యక్షమైనాడుగదా! ఏమి యా వాత్సల్యము, ఏమి యా స్వామిత్వము, ఏమి యా సౌశీల్యము, ఏమి యా సౌలభ్యము, ఏమి యా గాంభీర్యము, సద్గుణముల కన్నిటికి నీతడే యాకరము కదా! అట్టి వానిలో నీ గుణము లుండుటలో నబ్బురమేమి? ఈ స్వామిరూపమాధురిని నా నేత్రాంజలులతో గ్రావి ఈత డెచటికిని పారిపోకుండ నా హృదయపంజరమున నిపుడే గట్టిగా కట్టివైచెదను" ఈ రీతిగా నా శ్రీగిరి దివ్యమంగళ విగ్రహ కళ్యాణగుణసౌందర్యమును తనివిదీరక ననుభవించి అపూర్వవాఙ్మాధురితో నవరసములు జాలువార దేశభాషయగు ద్రావిడమున పలురీతులుగా గానముచేసెను. ఆయన వాణి ద్రావిడవాణికి నవరసార్ద్రభావబంధురాలంకారమయ్యెను. సంగీతసాహిత్యములు స్తనద్వయముగా శోభిల్లగా వాణి

యాకవి రసనపై మనోహర లాస్యముచేసెను. మచ్చుకొకటి రెండు ద్రావిడపాశురములను ప్రతిపదార్థతాత్పర్యములతో నిచట పొందుపరచు చున్నాను.

౨. కూఱాయ్ నీఱాయ్ నిలనాకి క్కొడువల్లశురర్ కుల మెల్లామ్
శీఱా వెరియుమ్ తిరునేమి వలవా తెయ్వక్కోమానే
శేఱార్ శునై త్తామరై శెన్దీమలరుమ్ తిరువేంగడత్తానే
అఱావన్బిలడియే నున్నడి శేర్వణ్ణ మరుళాయే.

ప్రతిపదార్థము:

కొడు-క్రూరులైన, బలిష్ఠులైన; అశురర్-రాక్షసులయొక్క; కులమెల్లమ్- వంశమంతయు; కూఱాయ్-తునకలై; నీఱాయ్-భస్మమై; నిలనాకి-నేలయై(మన్నై-నిశ్శేషమై) పోవునట్లుగా; శీఱా-కోపగించి; ఎరియుం-జ్వలించుచున్న; తిరునేమి-సుదర్శనమును; వలవా-దక్షిణహస్తమందు గలవాడా! తెయ్వమ్-నిత్యసూరులకు; కోమానే-నాయకుడా, శేరు-బురదచే; ఆర్-నిండిన; శునై-చెలమనీళ్ళయందలి; తామరై-తామరపువ్వు; శెమ్-ఎఱ్ఱని; తీ-నిప్పువలె (కాంతిగలదై); మలరుమ్-వికసించుచున్న; తిరువేఙ్గడత్తానే- వేంకటాచలమునకు స్వామియైనవాడా! ఆరా- అపరిచ్ఛిన్నమైన; అన్బిల్-నీవిషయమైన స్నేహముతో నున్న (స్నేహముగల); అడియేన్-దాసుడనైన నేను; ఉన్నడి-నీ శ్రీపాదములను; శేర్వణ్ణమ్-చేరువిధమును; అరుళాయ్-అనుగ్రహింపుమా!

తాత్పర్యము:

శత్రుసంహారకమయిన సుదర్శనచక్రమును చేతధరించి తిరుమలయందు వేంచేసియున్న ఓ శ్రియఃపతీ! నా పాపములను పొగొట్టి నీ భక్తుడనైన నన్ను నీ పాదములందు ఇపుడే చేర్చుకొనుము. ఇక నీ విరహము సైరింపజాలను.

"వానో మఱి కడలో మారుతమో తీయక మో
కానో ఒరుంగిత్తు కండిలమాల్— ఆనీన్ఱ
కన్ఱు యురత్తా ఎఱిన్దు కాయుదిర్ త్తార్ తాళ్ పణిందోమ్
వన్ తుయరై యావా మరుఙ్గు".

ప్రతిపదార్థము:

ఆన్-ఆవు; ఈన్ఱ-కన్నట్టి (అసురావిష్టమైన) కన్ఱు-దూడను; తామ్-తాము; ఉయర-పైకి; ఎఱిన్దు-విసరికొట్టి; కాయ్-వెలగకాయను; ఉతిర్ న్దార్-పడగొట్టినవానియొక్క; తాళ్-శ్రీపాదములను; పణిందోమ్-ఆశ్రయించితిమి; వన్-క్రూరమైన; తుయరై-పాపమును; (మన) మరుంగుం-సమీపమందుకూడ; కండిలం-కానకున్నాము; ఆర్-కనుక (అది); వానో-ఆకసమందో; మఱి-అలలుకొట్టుచున్న; కడలో-సముద్రమందో; మారుతమో-గాలియందో; తీయకమో-అగ్నియందో; కానో-అడవియందో; ఒరుంగిత్తు-చేరినది; ఆవా-ఏమాశ్చర్యము!

తాత్పర్యము:

శ్రీకృష్ణుడు వ్రేపల్లెలో పెరుగుచున్నాడని, వానివలన తనకు మృత్యువు తప్పదని తెలుసుకొని కంసు డాబాలుని సంహరించుట కనేక మాయలు పన్నెను. ఆ పసివానిని సంహరించిరమ్మని ఒక రాక్షసుని పంపగా వాడు ధేనుకాసురుడై కృష్ణుని సమీపించెను. మరొక రాక్షసుడు వెలగచెట్టు రూపముదాల్చి తనకాయలందు విషముధరించి దారిలో నుండెను. వాడే కపిత్థాసురుడు. భయంకరమైన కొమ్ములతో తనను పొడుచుటకు వచ్చుచున్న యాధేనుకాసురుని కృష్ణు డవలీలగా మేకపిల్లవలె నెత్తిపట్టికొని వెలగచెట్టుకువేసి కొట్టెను. కాని విచిత్రము. ఆ యసురు లిద్దరు కృష్ణుని దెబ్బతాకిడికి హతమైరి.

అంతేకాదు, ఆ యిద్దరు రాక్షసులు నశించుటతోపాటు మానవుల పాపపటలము పటాపంచలయ్యెను. వింత యేమన, ఆపాపము

చుట్టుపట్టుల నెక్కడను పొడగట్టలేదు. అది ఆకసమున కెగిరిపోయి నదో, సముద్రపు టలలో బడికొట్టుకొని పోయినదో, గాలిలో కలిసినదో - అగ్నిలో కాలిపోయినదో, లేక అడవిలో కలసిపోయినదో: తర్వాత నాపాపమే కనుపింపనేలేదు. ఏమాశ్చర్యము!

ఈ విధముగా శఠకోపస్వామి శ్రీమన్నారాయణస్వామిని ప్రార్థింపగా నాతడమందానందముతో భక్తవత్సలుడైనందున నిట్లానతిచ్చెను. "సుగుణమణీ, నీ వేల జన్మించితివో నీకు తెలియకున్నదా! నన్ను దర్శించుట కుపయోగించు విశిష్టాద్వైతభక్తిదర్శనగ్రంథజాలమును ద్రావిడ భాషలో నిర్మింపుము. తర్వాతనే నీవు నాసాయుజ్య మందగలువు."

ఈ విధముగా శ్రీపతి యానతిచ్చి యంతర్హితుడుకాగా శఠవైరి యా మురవైరినే సదా మనమున నిలుపుకొని తదీయకల్యాణగుణచేష్టితములను వివరించి మోక్షమార్గమును బద్ధజీవులకు కరతలామలకముగా ననుగ్రహించు ద్రావిడసంహితను నిర్మించెను. సంహిత యనగా జీవకోటికి మిగుల నాత్మహితము కల్గించున దని యర్థము. శ్రీ శరారివాక్కులు నవరసరసితములు: దివ్య ప్రేమసౌరభవర్షి సువర్ణ చాంపేయ సుమములు: మానవుల పాలిటి కైహికార్తిహరములగు పీయూషచషకములు, పాపాత్ముల దురితలతల కా ప్రబంధములు లవిత్రసదృశములు:

వకుళభూషణుల హృదయాంబుజమున బుట్టిన యా దివ్య ప్రేమ సౌరభాంకురములు స్వామి సందర్శనజనితానందరసాతిరేకమున నా కవి శేఖరుని జిహ్వాగ్రమునుండి వెలువడుటలోడనే విరాడ్రూపము ధరించి యక్షరపదభావము భజించి ద్రావిడాగమరూపమున విశ్వమంతటని తమ పరిమళములతో వాసింపచేయసాగెను.

ఇట్లు మన యాళ్వారులు భక్తిపూర్ణులై దక్షిణ భారతదేశమున గల ముప్పదియొక్క తిరుపతులలోని విష్ణుదేవుని యర్చామూర్తులను

మతింపసాగిరి. అట్లే ఉత్తర మథురలోని శ్రీకృష్ణునిగూడ పాడిరి. ఆ కవియొక్క భగవత్పరితాపై కతీవ్రతకు మెచ్చి తిరుపతి, శ్రీరంగము, కుంభకోణము మొదలగు దివ్యదేశములందలి విష్ణువుయొక్క యర్చావతారమూర్తు లాయన వద్దకు తమంతతామే వచ్చి ప్రత్యక్షమైరి. అంతేగాదు, ఆయన కూర్చుండియున్న చింతచెట్టు కొమ్మలను బట్టుకొని నిలబడి 'ఓ భగవత్కవీ! ముందు నాపై పద్యములు చెప్పి నన్ను ధన్యుని జేయుము, కాదు ముందు నాపై బల్కుము' అని అహమహమికతో వచ్చి గుంపుగట్టి కోరసాగిరి! చూచితిరా ఈ విచిత్రము!'

ఈ విధముగా నా కవిలోకమూర్ధన్యుడు –

వ. "అరవిందభవ సవర్యాప్త గోవింద
చరణారవిందనిష్యందమరంద
వారిధారాకార వరవారిపూర
పూరితగంభీర భూరి నిర్ఘోష
రంగదభంగ సంభ్రమభరోత్తుంగ
గంగాతరంగ వైఖరులు దీపింప"

– పరమయోగి విలాసము.

తన రసవద్వాగ్వైఖరితో స్వస్థలమును వదలకయే యెదుటకు వచ్చిన యా యా హరిమూర్తులను పాడిపాడి వారివారి గుణగణములను గానము చేసిచేసి యిహ జన్మమందే భగవత్సందర్శనముచే ధన్యులైరి.

అట్లా విధముగ నప్రయత్నముగ లభ్యమయిన శఠకోపకవితామృత మును చెదరిపోకుండ మధురకవీంద్రుడు తన లేఖినిచే లిపిబద్ధముచేసి మన మందర మా యమృతము గ్రోలుటకు కారణభూతుడయ్యెను.

నమ్మాళ్వారులు చతుర్వేదసారముగా నాల్గు ప్రబంధములను విబంధించిరి. మొదటిదగు ఋగ్వేదసారము 'తిరువిరుత్తము'న 100 పాశు

రములును, యజుర్వేదసారము 'తిరువాశిరియం' అను రెండవదానిలో 7 పాశురములును, మూడవది అథర్వణవేదసారము 'పెరియ తిరువందాది'లో 87 పాశురములును గలవు. నాల్గవదైన యీ గ్రంథము చరమప్రబంధము- మోక్ష ప్రబంధమని - వినుతి కెక్కెను. అదే యీ తిరువాయ్మొళి. ఇది ఛాందోగ్యోపనిష ద్వివరణ మని ప్రసిద్ధము. దీనిలో 1102 పాశురములు గలవు. ఇందు పది శతకములున్నవి. శతకమునకు పత్తు అని వ్యవహారము. ప్రతి పత్తునందును పది దశకములుండును. ఒక్కొక్క దశకమున 10 పాశురములును, ఫలశ్రుతి ఒక పాశురమునను నుండును. ఈ దశకమునే తిరువాయ్మొళి అని గూడనందురు. ఒక్కొక్క దశకమునకు 11 పాశురముల చొప్పున పత్తుకు 110 పాశురము లుండును. ఈ లెక్కను పది పత్తులకు 1100 పద్యము లయినవిగదా! ఒక దశకమున కేశవాది నామములు 12 చెప్పుటచే రెండు పాశురము లెక్కువ యయినవి. ఈ విధముగా మొత్తము గ్రంథమునందు 1102 కలవు.

ద్రావిడమున నున్న యీ గ్రంథ నిర్మాణమున నొక సారస్యము కలదు. అదే అంతాదిక్రమము. పద్యము ముగించిన చివరపదముతో మరల తర్వాతిపద్య మారంభింపబడును. దీనిని ముక్తపదగ్రస్త మని గూడనందురు. ఈ రీతిగా వేయి పద్యములు గూర్చి యొక వాఙ్మయ హారము నిర్మించుట భగవత్కటాక్షలబ్ధకవితావిభవులకేగాని యితరులకు సాధ్యము కాదు గదా!

ఈ గ్రంథమున అర్థ పంచకము – స్వస్వరూపము, పరస్వరూపము, పురుషార్థ స్వరూపము, ఉపాయ స్వరూపము, విరోధి స్వరూపము – అనునవి వివరింపబడినవి. ఆత్మయొక్క స్వరూపస్వభావములు తెలిసికొనుటయే స్వస్వరూపము. పరమాత్మస్వరూపజ్ఞానమే పరస్వరూపము, జీవుడు దేవుని పొందినందున గలుగు ఫలవివరణము

పురుషార్థ స్వరూపము. భగవంతుని జేరు మార్గవివరణమే యుపాయ స్వరూపము. దేవుని జేరుట కెదురగు విఘ్నపరంపరల నెరుగుటయే విరోధి స్వరూపము. తిరువాయ్‌మొళి ముఖ్యముగా ద్వయమంత్రార్థ మనబడు మంత్ర రత్న వివరణము. లక్ష్మీసహితుడగు నారాయణుని సేవించిననే మనము సర్వ దుఃఖములనుండి నిర్ముక్తులమై విష్ణు సాయుజ్యమందగలమని యది తెలుపును.

ఈ విధముగ నజ్ఞానాంధకారమును తొలగించి భగవద్దర్శనరూపసా రస్వతము ననుగ్రహించిన తన గురువగు నమ్మాళ్వారుల నాశుకవితాధా రతో యేకాదశీ పర్వసమమగు నేకాదశ సూక్తములతో మధురకవీంద్రుడు మధురముగా నుతించెను. దీనిలో భగవంతునికంటె గూడ భగవంతుని చూపిన ఆచార్యుడే పరమపూజ్యు డను రహస్యము సోపపత్తికముగా నిరూపింపబడినది. కాననే తిరువాయ్‌మొళి పఠించుటకు ముందుగా మధురకవి ఆళ్వారులు రచించిన యీ ఆచార్యస్తుతిని శ్రీవైష్ణవులు తప్పక పఠింతురు. అదే 'కణ్ణినుణ్ శిరుత్తాంబు'.

## కవితా వైభవము

"ఋషిం జుషామహే కృష్ణతృష్ణాతత్త్వమివోదితమ్,
సహస్రశాఖాం యోఽద్రాక్షీ ద్ద్రావిడీం బ్రహ్మసంహితామ్."

మానవుని కానందానుభూతి కల్గించుటకు కళ లవతరించినవి. తా ననుభవించిన శోకము శ్లోకముగా వెలువరించి విశ్వశ్రేయోదాయకమగు కావ్యము నిర్మించుట కవిబ్రహ్మ కొక్కనికి మాత్రమే చేతనయిన కార్యము. ఈ లోకము సృష్టించిన బ్రహ్మ వారివారి కర్మలననుసరించి మానవుల లలాటములపై వారిని నిర్మించునపుడే సుఖదుఃఖములు తీర్చి దిద్దును. కాని ఆ వ్రాత వ్రాసిన బ్రహ్మకు గూడ తెలియదు. మరి మన కెట్లు తెలియును? చతుర్ముఖుడగు బ్రహ్మవలెగాక చతురముఖు

డగు కవిబ్రహ్మ చేతనకోటిని దుఃఖదూరులను చేసి రసానందాబ్ధిలో ముంచెత్తును!

అట్టి కవులలో మూర్ధన్యుడు వాల్మీకి మహర్షి. విశ్వసాహిత్యము నకే ఆ మహర్షి ఆదికవి. "కవతే సర్వం జానాతి, సర్వం వర్ణయతి, సర్వం సర్వతో గచ్ఛతి వా కవిః" అని కవి శబ్దమునకు వ్యుత్పత్తి. సర్వమును ఎరిగి వర్ణింపగలవాడే కవి. "కవిః క్రాంతదర్శీ." త్రికాలవేది మాత్రమే కవి శబ్దవాచ్యుడు. "ఋషయో మంత్రద్రష్టారః." స్మరించిన వారిని కాపాడునదే మంత్రము. కాగా పూర్వపు మహర్షులకు, కవులకు ఈషణ్మాత్రమును భేదము లేదు. ఋషులు విశ్వహితైకకాంక్షులు. ఆ హితమును గూడ సహృదయులహృదయములకు నొప్పి కలుగకుండ సర సముగా నందించుటలో వారు కావ్యశిల్పము నాశ్రయించువారు. కాదు కాదు, శిల్పమే అట్టి మహర్షుల వాక్కులను వలచి వచ్చి ఆశ్రయించునది.

చరిత్ర తెలియజేయు చున్నంతలో అట్టి మహర్షుల కోవకు చెంది నవారు వాల్మీకి తరువాత శఠకోపమహర్షియే. నిర్హేతుకభగవత్కటాక్ష జన్యమగు వీరి వాగ్ధోరణియే తిరువాయ్మొళి యను దివ్య ద్రావిడ ప్రబంధము. దీనిలోని పద్యములను పాశురము లందురు. పాశుర మనగా అందమైన స్వరము అని యర్థము. ఈ పాశురములకు సాహిత్యపువిలువ మాత్రమే గాక చక్కగా పాడుకొనుటకు గూడ వీలుగా రాగతాళములు గూడ వీనికి నాథముని యను మహాకవి నిబంధించెను.

"శ్రియఃపతి యింత చక్కని కవితాసంపద నా కనుగ్రహించినాడు గదా! వీని నాతని కల్యాణగుణపరంపరాస్తుతికే తప్ప యితరుల కె ట్లుపయోగింపగలను?" అని ఆళ్వారులు నిశ్చయించుకొనిరి. "విశ్వ శ్రేయః కావ్యం" అని గదా నన్నయభట్టారకుని సూక్తి గూడ!

పూర్వాలంకారికులు సాహిత్యమునకు, కావ్యమునకు నే లక్షణములు నిర్వచించినారో అవన్నియు కొరత లేకుండ నీ దివ్యప్రబంధమునెడ

గూడ నన్వయించును. కాని యా గ్రంథము ద్రావిడభాషలోనుండుటచే దానిలోని కవితాగుణములు వర్ణించుట కిది తావు గాదు. కాన నిందలి ప్రధానలక్ష్యము మాత్రము నిట వివరింతుము.

“విద్యయా అమృతమశ్నుతే” అను సూక్తము విద్యకు ప్రధాన లక్ష్యమును బోధించుచున్నది. విద్యచే – అధ్యాత్మవిద్యచే – అమృతము లభింపగలదని దీని యర్థము. అమృత మనగా నిచ్చట మోక్ష మని యర్థము. ముముక్షువులకు మోక్షమే గదా అమృతము కంటే గూడ వాంఛనీయము! జన్మజరాదుఃఖమరణనివృత్తియు, భగవత్సందర్శనానందమును మోక్షపదమున కర్థములు. విద్యకు లక్ష్యములు గూడ నవియే.

ఇట్టి కవితాసంపదను తమ కనుగ్రహించిన యా పరాత్పరు నీ కవి యభినందించిన పద్యముల నిట కొన్నిటి నుదాహరింతును.

ఉ. “ఓలగ మొప్పనున్న భువనో త్తమశాసనశీలు, సన్మహీ
పాలు, తురంగరాక్షసవిభంజను, నా పతి సన్నుతించి కెం
గేలు మొగిడ్చి, మ్రొక్కు లెసఁగించి, మనోహరశబ్దమాలికా
జాలము నిచ్చికోఁదగిన సంపదఁ గంటి; నికేమి లోటగున్.” 341

నిండు కొలువున్న సర్వ జగత్పాలకుడు శ్రీమన్నారాయణుని వినుతించి అంజలిబంధముతో మ్రొక్కి చక్కని వాగ్రూపమాలికల నాతనికి సమర్పింపగల కవితాసంపదకు నోచుకొన్నాను గదా! నా కింకేమి లోపము?

ఉ. “పేల విశాలనేత్ర, రమ, నిత్య నివాసముసేయు పేరెదన్
గ్రాలెడు వాని, పెద్ద యనురాగపుఁ గమ్మలవాని, దేవతా
పాలకు గాటపుంగయితపాటలమాటలఁ బూజఁ జేసి, యీ
వేఁ గట్టి క్లేశసరణిన్ వదలించితి; భాగ్యమెట్టిదో!” 342

నీలోత్పలదళాక్షియగు నిందిరాదేవి తన హృన్మందిరమున వెలుగు చుండగా విశాలనేత్రములతో భక్తులను పరిపాలించు ఆ శ్రీమహావిష్ణువును సాంద్రమధురకవితాగానమాలలతో పూజించి యిహలోకమునగల బాధలన్నిటిని పోగొట్టుకొనగలిగిన నే నెంత భాగ్యశాలినో గదా!

ఉ. "అవిరళనిత్యమోదచరమావధిఁ దేలెడు నచ్యుతున్, గుణా
ఢ్యు, నళినాక్షు, దివ్యజననాయకునిన్ గలకాలమున్ సదా
ప్రవిమలగానమాలికలఁ బ్రస్తుతిఁ జేసిన భాగ్యశాలినై
యవిరళనిత్యమోదచరమావధి నేనును నోలలాడితిన్." 343

సాంద్రానందచరమసీమలో మునిగితేలుచుండు సద్గుణాకరుడగు దేవాధిదేవుని సదా నిర్మల వాగ్రూపగీతమాలికలతో ప్రస్తుతించుచున్న నేను గూడ సాంద్రానందచరమసీమలో మునిగి తేలియాడితిని.

ఉ. "తన్ను ననన్యులై కొలుచు దాసుల దోసము తూలఁ గౌఁగిలిన్
గొన్న పరున్, విహంగతురగున్, సముదుత్సుకచక్రహస్తు వా
గున్నత గానమాలికల నోపి నుతించిన భోగభాగ్య సం
పన్నుఁడ నాదు నాత్మఁ బరమాత్మ యొనర్చె నదెట్లెరుంగుదున్." 344

సదా తన్నే కొలుచు దాసుల దోషములు నశించనట్లుగా వారిని గట్టిగా కౌగిటగ్రుచ్చియెత్తు గరుడవాహనారూఢుని, భక్తాపకారిదుష్టజన శిక్షకై సదా తన సుదర్శనచక్రాయుధమును కేల సిద్ధముగావించుకొనియుండు నా దివ్యస్వరూపుని నోపికతో నుతింపగల్గిన భోగభాగ్యముల కేనాడో పెట్టి పుట్టినాను. కాని నా యాత్మ నా పరమాత్మ యెట్లు సృజించెనో తెలిసికొనజాలనైతిని గదా!

ఉ. "మనకున్ బుట్టువఁ గాపురంబుఁ గొను పద్మాదేవి, కానంద మి
చ్చును, భూమిస్థలకుం దివస్థలకు నీశుం డౌను; శీతాద్రి పీ
ఠనివిష్టాంఘ్రితలున్, జగజ్జనకు జాడల్ చాటు పాటల్ మహా
కృపారూఢిన్ రచియించు నాకుఁ బరమాకాశస్థలున్ సాటియే?" 348

భక్తులగు మనకును పద్మాలయయగు నిందిరాసుందరికిని నానంద ప్రదు డా మహనీయుడు. దేవమానవుల కీశ్వరుడు. జగజ్జనకుడగు నతని జాడ తెలియజేయు చక్కని పాటలు నిర్మించు నా కే దేవతలు సాటి కాగలరు?

ఐ. "తానే యిప్డు మదాత్మనా నొకఁటియై దైవాటి నాపల్కులన్
నేనే పల్కిన నవ్యకావ్య మను భంగిన్ వెల్లడిం జేసి, స్వీ
యామానోక్తులఁ దానె దన్ బొగడు మాయావర్తి మూర్తిత్రయీ
శానుం డాద్యుఁడు నాకు మున్ బలుకు నే జాడన్ బదుల్ దీర్చెదన్?" 682

ఆ పరమాత్మయే నా యాత్మయైనాడు. నేనే పల్కిన నవ్యకావ్యము వలె దీనిని నా వాగ్రూపమున వెలువరించినాడు. ఈ విధముగ నాతడు తన వాక్కుతో తన్నుతానే పొగడుకొనుచున్నాడు. నేను నిమిత్తమాత్రుడను. త్రిమూర్త్యాత్మకుడు, మాయామయుడు నగు నాతడు నాకంటె ముందే తన్ను గూర్చి తాను నా జిహ్వతో పలుకుకొనుచుగూడ నాకే యీ ఘనత కట్టబెట్టుచున్నాడు. చూడు డాభక్తపారిజాతమునకు నాపై గల యవ్యాజవాత్సల్యము! నిర్హేతుకతజాయమాన కటాక్షము!! అట్టి కరుణాసాగరునకు నేనేమి ప్రతిసేయగలను !!!

ఐ. "ఇతఁడే మూల మటన్న జ్ఞానమును నా కిప్పించి, నా జిహ్వపై
కుతుకం బొప్పఁగ ముందె వచ్చి, రసవద్గాఢప్రబంధంబుఁ బా
వితులన్ ముఖ్యులనైన భక్తులకుఁ దృప్తిం గూర్ప తన్ దానె కీ
ర్తితుఁడౌ మత్కృతికారకుం; డితనిమూర్తిన్ నేమఱన్ నేర్తునే?" 688

ప్రపంచమున కితడే యాది. ఇతడు మాత్ర మనాదియను జ్ఞానమును నా కీతడే కల్గించినాడు. ఇట్టి పవిత్ర సరసప్రబంధము భక్తులకు తృప్తి కల్గించుటకై లిఖియించి తనచే తానే కీర్తింపబడుచున్నాడు. నా యీ కృతికి కర్త యీతడే కాని నే నెంతమాత్రమును కాను. అయినను నేతద్గ్రంధకర్తను నేనే యను కీర్తిని మాత్రము తానే నాకు

కట్టబెట్టినారు. అట్టి యీతని దివ్యమంగళస్వరూపము నేను మరువగ లనా!

ప. "శీలరమన్ గ్రహించుటకు శిక్షితమున్, సులక్షణంబు, ర
మ్యాలపనంబునై, భగవదర్థమునైన కవిత్వభంగికిన్
జాలని జ్ఞానహీను, నను, స్వప్రతిమాను బొనర్చి నా వచో
జాలము సర్వపైఁ బఱచు చంద మొనర్చె; నదెట్టి ప్రీతియో!" 685

శ్రీమన్నారాయణుని భవ్యశీలసంపద నవగాహన చేసుకొనుటకై సుశిక్షితమును, సర్వకావ్యలక్షణసంపన్నమును, రమ్యాలాపయుతమును, భగవదేకార్థమును నగు కవితారీతిని సృష్టించుట కేమాత్రమును తగని పరమమూర్ఖుడనగు న న్నాతడు తనయంతవానినిగా చేసి నా కావ్యకళను ప్రపంచమున సులభముగ శీఘ్రముగ వ్యాపించు నుపాయము చేసెను. అయనకు నాపై నెంత ప్రేమయోగదా!

ప. "పరమ కవీశ్వరుల్ మధురపాటవచిత్ర కవిత్వచాతురీ
నిరతులు నుండ, స్వీయమహనీయచరిత్రము వారికైత చే
త రచనఁ బొంద కిప్పడు ముదంబున నన్విడకుండి, నాకె నా
పరమపదాధినేత నిజభవ్యకవిత్వముఁ గూర్పఁ గూర్చెడిన్. 686

ఆశుమధురచిత్రశీఘ్రరీతులతో నొప్పారు చతుర్విధకవితలు నిర్మించుటలో మేటియగు కవీశ్వరు లనేకు లుండగా తన మహనీయ చరిత్రము దరికైన వారి కవితను చేరనీయకుండ మార్జాలకిశోరన్యాయము ననుసరించి నన్ను మాత్రము వదలిపెట్టకుండ నాచే నా పరమపదనాథుడు భవ్యకవితానిర్మాణము చేయించుటకై బద్ధకంకణుడైనాడు. ఆహా, యేమి చిత్ర మిది!

ప. "వైకుంఠాధివిభుండు నా ముఖమునన్ భంగించు శుద్ధుండు నన్
జే కొన్నాఁడు, తనంత వానిగను నాచే స్తుత్యుఁ డౌ చుంట నే

వైకుంఠుండగునట్లు, స్వీయ విషయాప్రాంతత్త్వవిత్త్వాత్మ శు
ద్ధాకారుండగునట్లు, కాంచె; నతనిన్ ధ్యానించినం దీరునే?"

"బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి" అను సూక్తము ననుసరించి వైకుంఠనాథుడు నా పాపములు నిర్మూలించి పరిశుద్ధునిచేసి నన్ను స్వీకరించినాడు. తన్ను స్తుతించిన మాత్రముచేత నన్ను గూడ భ్రమర కీటక న్యాయముచే తనంతవాడనగునట్లుగా న న్ననుగ్రహించినాడు. నే నెంత తపస్సుచేసినను నింతవాడను కాగల్గియుండెడివాడనా? ఇపుడు దీని నే విధముగా తీర్చుకొని దయామయుడగు దేవుని ఋణమునుండి విముక్తుడను కాగలను!

ఉ. "ఇంక మాఱెయ్యది వాని సత్కృతికి? లేదే యాత్మనాఁ, జిత్తగిం
చి కనంగా నిపు డాత్మయు న్నిగుల కా శ్రీదేవు సొత్తయ్యె; స్వీ
య కృపాబోధక సాధుమంజులకవిత్వారంభుఁ గావించు సా
మికిఁ జేయన్ బ్రతి యొండొకింతయును భూమిన్నింగినిం గల్గునే?"

వాని యీ సత్కార్యమునకు బదు లేమి గలదు? పోనీ యమూల్యమగు ఆత్మపదార్థము నాది కలదు గదా! దాని నాతనికి సమర్పించిన కొంత ఋణమును తీర్చుకొనినట్లగునేమో! అయ్యో, ఏమి నా వెఱ్ఱి! సకల పదార్థములును ఆతనివే యయియుండగా ఈ నా ఆత్మమాత్ర మాతనిది కాకుండునా! అన్నిటికంటె గొప్పది యగు మృదుమధురభగవత్కవితను నా కనుగ్రహించిన యాతనికి ప్రతిగా సమర్పించుటకు భూమ్యాకాశములలో ఒక్కటియు నాకు కన్పించుటలేదు కదా!

కోమల కాంత పదావళితో నొప్పారు మృదుమధుర భగవత్కవితనుగ్రహించిన యీ కవిలోకమూర్ధన్యుని ఋణము మన మెట్లు తీర్చుకొనగలము! వారి కవితచేతనే భగవంతుని స్తుతించి మోక్షమార్గాన్వేషకులమగుటయే మన కనిష్ఠకర్తవ్యము సుడీ!

# వకుళభూషణనాయకి

మో ముని ర్నాయికాభావ మాత్మ న్యారోప్య చక్రిణః,
హరిం వందే శఠారాతిం తం వందే భగవత్కవిమ్.

"కామోత్కంఠతఁ గోపికల్, భయమునన్ గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులున్ ప్రేమన్ మీరలు
భక్తినేము నిదె చక్రిం గంటి, మెట్లైన ను
ద్దామధ్యానగరిష్ఠుడైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా!"

— భాగవతము.

తీవ్ర భగవత్కామవాంఛతో గోపికలును, భయముతో కంసుడును, వైరముతో శిశుపాలాదులును, బంధువులై వృష్ణివంశీయులును, ప్రేమతో పాండవులును, భక్తితో నారదాదిమహామునులును, భగవంతుని దర్శింప గల్గిరి. తీవ్రధ్యాననిష్ఠులు మాత్రమే దేవుని దర్శింపగలరు.

ఏ రీతిగా భజించినను భగవంతుని చేరనగును. కాని భగవంతుని చేరవలెనను పరితాపము జీవుడు తీవ్రముగ ననుభవించుటమాత్రము మిగులనవసరము. అట్టి పరితాపము తీవ్రముకానినాడు భగవంతుడు మనకు పట్టుబడడు. ఆతని జేరుటకు నవవిధభక్తిమార్గములు కలవు. పోతనార్యుని వాక్కులలో వీని నిట్లు పేర్కొనవచ్చును.

వ. "తనుహృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్, దాసత్వమున్, వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్, సంకీర్తనల్, చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి, స
జ్జనులై యుండుట భద్రమంచు దలఁతున్; సత్యంబు దైత్యోత్తమా!"

త్రికరణశుద్ధిగా నీశ్వరునితో భక్తినెరపుట, తత్కల్యాణగుణవర్ణన నాకర్ణించుట, దాస్యము చేయుట, నమస్కరించుట, చేతులతో పూజించుట, నేత్రములతో సేవించుట, మనస్సుతో తెలిసికొనుట, వాక్కులతో

దివ్యనామసంకీర్తనము చేయుట, చింతించుట - అనునవే నవవిధ భక్తులు.

కాని గోపికలవలె భగవత్కామము నిలుపుకొని తత్సంయోగమునకు తహ తహ లాడుటయే పై మార్గము లన్నిటిలో భగవంతుని చేరుటకు సులభోపాయము. త్రికరణశుద్ధిగా సఖ్యము నెఱపుటలో బిడ్డవలె గూడ దేవునిపై వాత్సల్యము నెఱపవచ్చును. ఇట్టి వాత్సల్యభావమునకు రస పరిపాకము కల్పించినవారిలో పెరియాళ్వారు అను పేరుగల విష్ణుచిత్తు లగ్రేసరులు. ఆ మహాకవివలెనే సూరదాసు గూడ శ్రీకృష్ణుని తన బిడ్డగా తలచి ఆయన దివ్యమంగళవిగ్రహసౌందర్యమును కళ్యాణగుణసంప దను ఎంతో మృదుమధురముగా సూరసాగర మహాకావ్యమున హిందీలో చిత్రించినాడు.

ఆండాళ్ అను నామాంతరముగల గోదాదేవి శ్రీరంగనాథునిపై తన విరహార్తిని వాగ్రూపమున ప్రకటించి చివర కాయననే భర్తగా పొంది ఆయనయందే యైక్యము గాగలిగెను, ఈ కవయిత్రి పద్ధతినే అనుసరించి కృష్ణభక్తాగ్రేసరురాలు మీరాదేవి హిందీలో చక్కని బాణీలో హృదయము నకు హత్తుకొనునట్లుగా సంగీత సాహిత్యముల నేకముచేసి ఉఱ్ఱలగునట్లు భక్తిగీతములు పాడెను.

కాని నాయికావిరహమును పురుషుడు తనపై నారోపించుకొని దేవుని పాడినట్టి భక్తకవులకు నమ్మాళ్వారులే మార్గదర్శకులు. నమ్మాళ్వార నుమాటకు మన యాళ్వారు లని యర్థము. భక్తిప్రవాహపూర్ణ నది యని భావము. వారి సూక్తులలోని భక్తిరససమృద్ధి ప్రపంచమునందలి యే భాషాసారస్వతములందును గూడ గోచరింప దనుట యతిశయోక్తి కాదు.

"మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః."

మనస్సే గదా మనుజుల బంధమోక్షములకు కారణము! దైవ ప్రార్థనకు సుముఖముగనుండుట కా మనస్సు నీ కవిశిరోమణి యెట్లు మచ్చిక చేసుకొనుచున్నారో తిలకింపుదు.

ఉ. "తేనియు, పాలు, నేయి, సుధ, తీయని చక్కెర మేళవించుచున్
పానముఁ జేసి నట్లనుభవంబగు నా మధుసూదనుండునున్
నేనునుఁ గూడి కూడి కమనీయరసంబునఁ దేలి యాడ, నో
మానసమా! శరీరమున మంచితనంబున నీవు నిల్చుటన్." 121

తేనె, పాలు, నేయి, అమృతము అనువానిలో చక్కెర మేళవించి చేసిన పంచామృత మెంత మధురముగా నుండునో అట్లే హరినామకీర్తనామృత మాధుర్యముచే నే నొడలు మరచియుండుటకు కారణము—మనసా, నీవు నాపై దయ చూపుటయేగదా!

"స్త్రీప్రాయ మితరం జగత్" అను నానుడి భక్తలోకమునకు చిర పరిచితము. భగవంతు డొకడే పురుషుడు. ఇతరు లందరు స్త్రీలే. సదా కలసియుండిన విసుగు తప్పదు. తినగా తినగా గారెలు గూడ చేదగును గదా! కాననే వియోగానంతర సంయోగమునకు మన యాలంకారికులు విలువ నిచ్చినారు.

నాయిక తన భర్తను వదలియున్నపుడు పడుతాపమును వీరు శ్రియఃపతికై యనుభవించినారు. వకుళభూషణులు నాయికా భావము తమపైనారోపించు కొని విరహజ్వరార్తితో నెట్లు వెచ్చనూర్చుచున్నారో మనము గూడ అవగాహనము చేసుకొని దాని ననుభవింప ప్రయత్నింతము గాక! కాని ఆ యోగి మనఃస్థితి నే కొంతయైన నలవరచుకొన్ననే గాని మన కది సాధ్యము కాదు సుమండీ.

తే. "అబ్జముఖి యీపె భక్తిచే నాడి యాడి
భావము కరంగ నీ కతల్ పాడి పాడి

కంటఁ దడఁ బెట్టె నట్టినల్ కాంచి కాంచి
నారసింహో యటంచుఁ బల్కాయుఁ దిల్చు." 131

ఆళ్వారునాయికి భక్తి పరవశయై దైవమును ప్రత్యక్షము చేసుకొనుటకై విసుగులేక నాట్యమాడినది. హృదయము కరగున ట్లాతని కథలు పాటలుగా పాడి పాడి యలసిపోయినది. ఆత డెంతసేపటివరకును రానందున కన్నీ రప్రయత్నముగా జాలువారగా దశదిశలు పరికించి 'ఎందుంటివి నారసింహా!' యని పలుమారు పిలిచినది.

ప. "లక్కయును మైనమునుఁ నగ్నిప్రక్కనున్న
కరగి విన్న మనస్సునఁ గరగి నీ వె
కరుణఁ జేయువు రావణాసుర పురారి!
యేమి సాధన మిఁక నేను నేమి సేతు?" 133

లక్కయు మైనమును నగ్నిస్పర్శచే కరగి పోవునట్లు యీమె గూడ భగవంతుని తలపగనే – ఆతని నామము చెవిని పడగనే -- ద్రవించి పోవును.

ప. "నవంబాలిక యీమె! విశాలలోల
నేత్రములనుండి బొటబొట నీరు కారు
విహత లంకేశ! యీ మృగనేత్ర కింక
దృష్టి సౌందర్యమును వాడనీదు కద్యు." 440

వియోగతాపతప్తయైన ఈమె కండ్లనుండి దుఃఖాశ్రువు లెడతెగక స్రవించినందున యీ నాయికి నేత్రసౌందర్యము దెబ్బతినునో యేమో గదా! శ్రీరఘురామా, అట్లు జరుగనీయకుమా, నీకు పుణ్యముండును.

ప. "కమలం గూరుకు రేఁ బవ ల్గనదు కైఁ గన్నీళ్ళు జల్లున్ నమ
మ్మువుఁ గావించుమ సంకు, చక్ర మని మేల్పున్ గుందుఁ గెందామరల్

కనుంంచు న్నిను వీడలే నని క్షితిన్ గై వంటు శ్రీరంగ భూ
విని మీనాంచితనీరసీమ మను సామీ! యీమె కే మయ్యెడున్?" 611

ఈమె రాత్రింబవళ్ళు నిద్రకు మొగము వాచినది. కన్నీటితోనే చేతులు కడిగికొనుచు విష్ణువు ధరించు శంఖచక్రములకై పరితపించును. "కృష్ణా నిన్ను వీడలేన"ని కుందుచుండును. శ్రీరంగనాథా, ఈమెగతి ఏమి కానున్నదో గదా!

వ. "మల్లికా గంధిలమలయుగంధవహంబు
చెంరేగి నన్నుఁ బట్టి చీల్చసాగె,
వందమైన 'కురంజి' యనెడు స్త్రీరాగంబు
వినవచ్చె, నస్తంగతుని విభాను
గొనిన సంధ్యాకాలమును భ్రమింపఁగఁ జేసె;
వరుణాభ్రరుచిజాల మడలుపెట్టె,
పుల్లమనోహార పుండరీకాక్షుండు
మన సామి వల్లవజనవృషభుఁడు
సింహగమనుండు మాయుండు చిక్కఁబట్టు
కొని పరీరంభ మొనరించుకొనిన స్తనభు
జములఁ గొంపోయి యొంటిగా సాగి మనము
వేరుకాను తాన మెందేని నేర మకట. 881

మల్లెపూల సువాసనలతో గుబాళించు మలయవాయువు నన్ను పట్టుకొనిచీల్చివేయుచున్నది. కురంజియను రాగము శ్రవణగోచరమగుచున్నది. సూర్యునిమ్రింగిన సాయంసంధ్య నాకు మోహము కల్గించుచున్నది. ఆకాశ మెఱ్ఱవడుట చూచి నా మనస్సు గూడ ప్రియానురాగరక్తమగుచున్నది. వికసన్నవపద్మదళాక్షుడును మన వల్లవీవల్లవుడునగు మాయకృష్ణుడు వచ్చి ఊపిరాడకుండ బిగికౌగిట చేర్చిన స్తనములను

భుజములను కల్గియుండి కూడ కాంతుడులేని నే నెట్లీ యేకాంతము గడపుదును? అయ్యో! ఎందుఁజొత్తును!

ప. "ఉత్తరపవనంబు యుల్లమందునఁ దొచ్చి
విచ్చెడి నే నెంత విగతభాగ్య;
అకట చల్లని యుత్తరాశానిలంబుఁ
మండెడి గాడ్పు లై యుండసాగె;
నాసింపఁ దగు చల్లనైన జాబిల్లియు
వేడిమిఁగం చంద్రబింబ మయ్యె!
అతిమృదు కుసుమశయ్యయు నాకు వేడెక్కె;
పొలుపు రెక్కలుగం పుల్గువేవి
తేజిఁగొను విష్ణుదేవుడన్ దేఁటి తినగ
నాదు స్త్రీత్వసుమంబు జీర్ణత్వ మొందె;
అగండంగక నాత్మలో బాగులుకొనియె.
సాడు వెంతయు నా మన సీడుకొండె. 811

ఉత్తరవాయువు నా గుండెలనే చీల్చివేయుచున్నది. అయ్యో, నేనెంత దౌర్భాగ్యురాలను! దక్షిణమారుతమే నా పాలిటికి వడగాడ్పయినది. చల్లని వెన్నెలలు గురియు నెలరాజే సలసల క్రాగుచున్న యినుపగుండువలె నన్నట్లు వేపుచున్నాడు గదా. మెత్తని పూలపాన్పే నా కిప్పుడు వేడి కల్గించుచున్నది. చక్కని రెక్కలు గల గరుడుని వాహనముగా దాల్చిన విష్ణువను తుమ్మెద యనుభవింపగా నా స్త్రీత్వమను పుష్పము జీర్ణమయిపోయినది. నా మనస్సుపూర్తిగా నా వశము తప్పినది. అయ్యో, నే నేమి సేతును?

తనపై నాయికాభావ మారోపించుకొని భర్తయగు శ్రీమన్నారాయణునితో నైక్యమందుటకు తహతహలాడిన యీ వకుళభూషణనాయకి యొక్క భక్తిరస మెంత సుపరిపుష్టముగా నీ సరసకవితాసంహితలో నిరూపితమైనదో తలచుకొన్న మన యొడలు పులకరింపక మానునా!

# సందేశము

ప. "హరికంటెన్ బరమైన శరణ్యమిఁక లేదంచున్ నిరూపించి, భూ
భరమున్ మాన్పగ మత్తరంపుమధురన్ బ్రాపించి తాఁ బుట్టె మా
సిరి; 'గృష్ణార్పణమస్తు' టంచుఁ గని యుజ్జీవింపుడీ, సందియం
బొరయుంబోకుఁడి వాని యర్థములె కావో? యున్ని వేదవ్యముల్." 810

ఈ ఆళ్వార్లు జీవుడు దేవుని చేరుటయే సర్వదుఃఖ నివారణోపాయమని తేల్చి చెప్పినారు. అడుగడుగునకు ఇది మనకు వీరి కావ్యముల ద్వారా సువ్యక్తమగుచునే యుండును.

సామవేదసారమగు చివరి గ్రంధమునకే వీరి కృతులలో ప్రాముఖ్యము గలదు. మోక్షమార్గము నరచేత నరటిపండొలిచి యిడినట్లు సులభముగా చూపును గాన దీనికి చరమప్రబంధమను పేరు ప్రసిద్ధమయినది.

ప. "అశ్రమమహోన్నతానందు నజ్ఞజన వివేకదాత స్థిరజ్ఞామరైక నేత
భాసురంబును దుఃఖనివారణ మగు పదమె యాశ్రయ మని పట్టి బ్రతుకు మనస!

ఓ మనసా! ఎక్కువ శ్రమపడకుండగనే మహోన్నతబ్రహ్మానంద మిచ్చునట్టి, అజ్ఞానులకు వివేకమిచ్చునట్టి, అమరులకుగూడ రక్షకుడైనట్టి, సకల దుఃఖనివారకుడునైనట్టి ఆ శ్రీమన్నారాయణుని పదపద్మములనే రక్షకముగా తలచి బహూళ దుఃఖప్రదమగు నీ జీవితము నెట్టెటో గడపుకొనుము!

నేను నాది అను భావము మొదలంట బెరికివేసి విశ్వేశ్వరు నాశ్రయింపుడు. ఆత్మలన్నిటికిని ఆత్మకాననే ఆతడు విశ్వాత్ముడు. ఆతడే మీకు మేలు కలిగింప గలడు –

ప. "మీరలు మీయది యనునది వేళ్ళు మొదలు మాడఁబెరికి విశ్వేశ్వరునిన్
జేరుఁడి, ఆత్మలకంతకు మీరిన యాధిక్యమేది? మేలొడఁగూర్చున్." 13

త్రికరణములను మొదటనుండి స్వాధీనముచేసుకొన్నచో నీ స్వామిని తప్పక చేరుకొనగలవు —

"మనసును, వాకును, కాయము ననఁబడు మూడింటి వితమునారసి పిదప్,
మునుమున్నే లొంగఁజుచికొనుమా ! నీ సామిఁ జేరికొనుమా వినతిన్." 20

భక్తుడగువా డనన్యమైన భగవత్ప్రేమను తైలధారవలె నెడతెగక నా విశ్వేశునిపై ప్రవహింపజేయుచునే యుండును. మన కరచరణాద్యవయవములను భగవత్కైంకర్య మను సత్కార్యమునందు గట్టిగా లగ్నము చేయవలెను. ఈ భావము నీ కవి యెంత నిష్కర్షగా చెప్పినారో!

ప. "పట్టు విడుపులేని యీ పరమపురుషు
పట్టఁబాయదు మనసు; తద్భజన మెపుడు
జేయుచుండును జిహ్వక; కాయమును ప
రవశతను బొంది లేచి నర్తనము సేయు."

దీనినే వేర్వేరుకవు లెట్లు చిత్రించినారో చూతము.

కులశేఖరులు —

"జిహ్వే కీర్త్తయ కేశవం, మురరిపుం చేతో భజ, శ్రీధరం
పాణిద్వంద్వ సమర్చయాచ్యుతకథాః శ్రోత్రద్వయ త్వం శృణు,
కృష్ణం లోకయ లోచనద్వయ, హరే ర్గచ్ఛాంఘ్రియుగ్మాలయం,
జిఘ్ర ఘ్రాణ ముకుందపాదతులసీం, మూర్ధ న్నమాధోక్షజమ్."

బమ్మెరపోతన —

ఉ. "హరి భజియించు హస్తములు హస్తము, లచ్యుతుఁ జేరి మ్రొక్కు త
చ్ఛిరము శిరంబు, చక్రధరుఁ జేరెడు చిత్తము చిత్త, మిందిరా
వరుఁ గను దృష్టిదృష్టి, మురవైరి నుతించెడు వాణి వాణి, య
క్షరుకథ లాను కర్ణములు కర్ణములై విలసిల్లుఁబో భువిన్."

కానుల పురుషోత్తమకవి –

ఉ. "హరి భజియింతు నే వహరహంబు, హరి న్మరియింతు భక్తితో,
హరికి నవర్య సేతు హరి కంజలు లిత్తు మనోహరంబుగా,
హరివరిమైన దేవత యుజాండమున న్నహి యుంచు నెంచ శ్రీ
హరిపురిఁ జేరవచ్చు మనసా! హరిపాదము లాశ్రయింపుమా."

శ్రీమన్నారాయణస్వామి తన్ను నమ్మికొల్చిన వారికి సర్వసౌఖ్య ములను అనుగ్రహించి ఇక వానిని వదలకుండ కాపాడును నుమండీ--

మ. "కన్నులందమ్ముగనమండి నెమ్మదమునం గన్నీరునుం గారు శ్రీ
మన్నారాయణదివ్యనామ మది యేమాత్రంబు విన్పించినన్
మన్నారుం దరిసించి చేరునెడ ప్రేమం జేర్చి రేయింబవల్
నన్నున్నన్నవనిఁ జేయు. నన్ను విడఁ జేసాఁ దేవి యాశ్చర్యమా.

వ. "ఇందుఁ గలఁ డందు లేఁ డని సందేహము వలదు, చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన నందందే కలఁడు; దానవాగ్రణి వింటే!

అను నీ భాగవతసూక్తికి జోడైన భావన యాళ్వారుల కావ్యమున గని పులకితులు కండు –

మ. "క్షణఁ దెచ్చె హరియున్న కన్నెరుటరుల్ ఖండించి యుక్తాంబువున్
గంటిరా? ఘనమగు కంబమున నృహరి వక్త్రంబుపం బుట్టి ని
స్తంభోత్పత్తి హిరణ్యుఁ జక్కడఁచెఁ దోడ్తో మా నృసింహుండు, త
ద్బంహితమాహాత్మ్యము లౌను కా దనుచు వాదా మెంత హాస్యంబగున్!"

ఒక యర్భకుని మాట ననుసరించి స్తంభమున నుద్భవించి దుర్గ ణాకరుడగు హిరణ్యకశిపుని వధించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి భక్తుల సంకటముల నెందుకు తీర్పడు!

ఉ. "గొంగలు నవ్వ బందుగులు గొల్లన నేడ్వ నచింత్యదుఃఖ మె
ల్లం గలిగించు లౌకికకలాపము లేల కృపాళు మాకు ను
త్తుంగతరంగ సంకులిత తోయధిమంథన! నీ పదంబె చే
ర్పం గల మృత్యువుం గను మహాయుము నా కెఱిగింపు సత్వరన్."

శత్రువులు నవ్వగా బంధువులేడ్వగా సర్వదుఃఖములు కల్గించు లౌకిక వ్యవహారము లిక మేము చేయలేము స్వామీ; నీ పాదారవిందములను చేర్చునట్టి మృత్యువునే మా కనుగ్రహింపుము –

ఉ. "అంబుధివర్ణుదాసు లిల నుంతట దిర్గుచు పాడియాడి స్వే
చ్ఛం జరింపఁగంటి, మిహ జీవుల పాపము మాసె, బాసె ఘో
రం బగు నారకంబు, కలి ప్రాప్పడె, నయ్యమధర్మరాజు లా
తెం బడు వారె లేరిక; సమృద్ధి సమృద్ధి సమృద్ధి కావుతన్."

భాగవతోత్తములలోనే భగవంతుడుండును. అతని యస్తిత్వము వేరుగాలేదు. అట్టి శ్రీహరి చరస్వరూపులగు భక్తులను కాంచగనే మన పాపములు పటాపంచలయి పోయినవి. కలి దోషములు హరించినవి. ఇక యముని క్రూరకార్యకలాపములు మూలపడినట్లే. ఎటు చూచినను హరిభక్తిసామ్రాజ్యమే వృద్ధిచెందగలదు.

"కలౌ స్మరణాన్ముక్తిః" అన్నారు గదా: ఆ రీతిగా కలిదోషములు నశించుటకు కృతయుగమే ఈ భువిపై కవతరించినట్లు. పరమపదమునుండి నిత్యసూరు లను పేరుగల భక్తులే ఈ యిలపై కవతరించినట్లు, సముద్రము వలె పొంగి ముందుకు సాగి వచ్చుచున్న శ్రీపతి భక్తులు తమ సామగానముతో ఆ శ్రీహరిని పాడుచు యావత్ప్రపంచమును విపదంబుధినిమగ్నము కాకుండ కాపాడుదురుగాక, మీరందరా భాగవతోత్తముల నాశ్రయించి తరింతురుగాక యను మహాసందేశము నాళ్వారులు మనకు పై పద్యమున ననుగ్రహించుచున్నారు.

ప. "తొమఁబెండ్లాములు బిడ్డ లాప్తులును దక్కంగల్గఁజుట్టాలుఁ గ
ల్గౌను వల్లిప్పుడె తూర్తు, రొండవుడు పొందుల్ ధార్తు, రక్షాకరం
బగు శ్రీఁదన్ బయినున్న జున్నిఁ దవతుందున్ బొందు సర్వేశు భ
క్తిని జీవించుట తక్క దిక్కు మరి యేది? మీకు లేదే సుఁడీ."

భార్యాపుత్రులు, ఆప్తులు, బంధువులు మొదలగు వారందరును మన వద్ద ధనమున్నంతవరకే యీగలవలె చుట్టును మూగుదురు. ఎట్టి మాయోపాయముల నయినను మనపై ప్రయోగించుటకు వెనుదీయుక దానిని మన చేతులనుండి సంగ్రహించి ఎక్కడివారక్కడకే తొలగిపోవుదురు. కాన పై జెప్పిన బంధువులు మొదలగు వారిపై ప్రేమ వదలి దశ దిశలందును వ్యాపించియుండి యన్నింటిని తనయందే లయము చేసుకొను సర్వేశ్వరుని భజించుట తప్ప మీకు వేరు దిక్కేదియులేదు నుమండీ –

ప. "చెలులన్ రక్షకు లట్లు పట్టుకొనుచున్ చేజిక్కు మేలున్నచో
జెలగల్ వోలిక జ్ఞాతి బంధువులు పైపైఁ బీల్తు: రేకాస్త్ర ని
ర్దళితోత్పాటిత సప్తసాలు, మన యత్రమవ్యాయమునే నేతగా
గొలువన్ బూని మనుండు తక్కినవి బొంకుల్ వ్యర్థసంబంధముల్." 802

భార్యలు మనలను రక్షించుటకై వచ్చినట్లు నటింతురు. చేతికేమైన చిక్కు నవకాశము కనుపించిన జెలగలవలె పట్టుకొని పీల్చి పిప్పి చేయుటకుగూడ వెనుగాడరు. ఒక్క యమ్ముతో సప్తసాలములను పడగొట్టిన నీలమేఘనిభాంగుడగు మన శ్రీకృష్ణునే సర్వరక్షుడుగా తలచి కొలిచి మనుడు. తక్కిన బంధములన్నియు బూటకములు

ప. "తమ కార్యజ్ఞతఁ దామె మెచ్చికొని పొంతన్ దేవిజుల్ జిల్కు వా
క్యములన్ బల్కెదరు స్త్రీలతో మధురభోగంబందువా రారట
వ్యమునుం గందురు; భీకరాసురులఁ జెండన్ బుట్టు శ్రీకృష్ణ దా
స్యముఁ జేపట్టి మనుండు, లేరు సుఖమవ్యం బంతకన్నన్ గాఁడీ." 805

తామే యో పెద్ద వ్యవహారదక్షులయినట్లును, పురుషులు తెలివితక్కువ దద్దమ్మలయినట్లును స్త్రీలు తలతురు. అట్టివారి మోహజాలమున చిక్కుకొని కృత్రిమ భోగాదుల ననుభవించువారు తర్వాత ఘోరనరక యాతనలనుగూడ ననుభవింపక మానరు. కాన క్రూరరాక్షసుల నణచి లోకసంగ్రహముచేసె శ్రీకృష్ణునే యా రాక్షసులను మించిన మీ యరిషడ్వర్గమును చీల్చి చెండాడు మని ప్రార్థించి శరణువేడుడు. అంతకంటె సుఖమందుటకు మీకు మార్గాంతరము లేదు.

చ. "కులముల్ నాల్గింటె కంటె హీను లవివేకుల్ చండచండాల జా
తులవారైన, సుదర్శనాంచితభుజన్ ద్యోతేంద్రనీలాంగు దా
సుల మంచున్ మది నమ్మిరేని, యుల దాసుల్, వారి సేవించు దా
సులున్ వారల దాసులు న్మనకు(బూజ్యుల్ స్వాములున్ నిచ్చలున్." 269

శ్రీహరికంటె రక్షకుడు మరొకరు లేరు. భూభారము మాన్పుటకే అత డవతరించినాడు, అని నిరూపించుటకు మీ పుణ్యముపండి ఉత్తర మధురానగరిలో నాత డవతరించినాడు. కాన నికముందు మీరే పనిచేసినను "సర్వం శ్రీకృష్ణార్పణమస్తు" అని పల్కి ఫలాపేక్షవదలి శ్రీకృష్ణునికి దానిని ధారపోయుడు. సందియ మందనేల: ఈ కనుపడు నవన్నియు వానికి చెందినవే. ఇతరులకు వీనితో నెంతమాత్రమును సంబంధము లేదు.

## కణ్ణినుణ్ శిరుత్తాంబు

"ఆచార్యస్స హరి స్సాక్షాత్ చరరూపి న సంశయః,
మగ్నా నుద్ధరతే లోకాన్ కారుణ్యా చ్ఛాస్త్రపాణినా."

మూర్తీభవించి సంచరించు శ్రీమహావిష్ణువే ఆచార్యుడు. అజ్ఞానాంధకారమగ్నమగు జీవకోటికి తన యాచరణ యను పవిత్రకరావలంబనము ననుగ్రహించి వారికి జ్ఞానోపదేశ మాయున చేయును. శ్రీ మహా

విష్ణువే ఆచార్యుడై అవతరించి జీవుల నుద్ధరించును. ఈ చిన్నకావ్యము గురుభక్తి బోధకము. ఇది మిగుల చిన్నదియు మహత్తరమును గాన తెలుగున దీని యనువాదము నందించుచున్నాను. ద్రవిడమునందువలె దీనికూడ నంతాది క్రమమున పరమమధురముగా రచించిన "సంగీత సాహిత్యకళానిధి" శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులుగారీ సందర్భమున మనకభివందనీయులు;

'కణ్ణినుణ్ శిరుత్తాంబు' అనగా ముళ్ళుగల సన్నని చిన్న కన్నె త్రాడు అని అర్థము. వేదాంతవాక్యములచే గూడ ననిర్వచనీయుడగు నా కృష్ణుడు తల్లి చేత బట్టుకొన్న చిన్న ముళ్ళత్రాటితోనే కట్టబడెను గదా: అట్లే భక్తులయిన వా రెట్టి పరుషవాక్కులతో నుతించినను ఆశ్రితజనరక్షాదీక్షితుడగు నా శ్రీహరి వారియెడ తప్పక ప్రసన్ను డయితీరుననుటయే దీనిచే ప్రతిపాదింపబడు మహార్థము. కాని యా దేవుడు గూడ సదాచార్యుని ద్వారా సమాశ్రయించిననే గాని మనకు సులభుడు కాజాలడని గూడ నిం దర్థము గర్భితము.

వాంఛఁ జిఱుత్రాటిచేఁ గట్టువడిన పెద్ద
మాయకాఁడగు నా ప్రభు మాటకన్నఁ
గురుక కధ్యక్షుఁడగు శఠకోపు స్మరణ
నొల్కు నమృతంబు రుచియించు నాల్క కెపుడు. 1

నాల్క నిండారఁ బాడి యానంద మంది
తిని, దదంఘ్ర్యబ్జములు బట్టితిని, దదన్య
దేవు నెఱుఁగను, శఠకోపదివ్యగీత
వరసగానమ్ము సేయుచు దిరుగుచుందు. 2

తిరిగి దేవాధిదేవు సుందరవిశాల
కోల మావాడు నెమ్మనఁ జూడఁ గంటి;

అహహా! సముదారుడౌ కురుకాధినాథు
దాస్యమున భాగ్య మిద్ది లబ్ధమ్ము నాకు. 3

నాదు నైచ్యముఁ జిత్తమునం దలంచి
తల్లియై తండ్రియై కొఱంతలను బాపి
ప్రేమ గుణపూర్ణుఁ డామ్నాయములకుఁ జిక్కు
లెల్లఁ దీసిన శఠవైరియే ప్రభుండు. 4

ప్రభుని పొత్తగు నాత్మ నా వశ మటంచు
నమ్మి మున్నంతయుఁ బరాంగనలను గోరి
యుంటి, బంగరుమేడల నొప్పు కురుక
యధిపు సేవ సమర్థుండనైతి నింక. 5

ఇంక నెక్కాలమును స్థిరవృత్తిఁ దనదు
భవ్యగుణములు పొగడెడి భాగ్యమిడెను,
పర్వతోత్తుంగ సౌధాళి బరగు కురుక
పతి యిఁకెన్నఁడు నన్ విడువండు కనుఁడు! 6

కని సమం గారితనయుండు కరుణ నా పు
రార్జితోరుతరాఘము లణఁచినాఁడు
చాటెదమగాక యెల్ల దిశలను దెలియ
ద్రవిడకవినేత శ్రీ శఠారాతి కరుణ. 7

కరుణఁ గొనియాడు దాసనికరము కరము
హర్ష,మందఁగ వేదరహస్యములను
ద్రావిడమ్మున వేయిగీతములఁ దెల్పి
నతని కృప యిజ్జగమున నాఢ్యమ్ము చాల. 8

చాల మోక్షార్థులకు వేదసారములను
బాడి, నా మనమున స్థిరపరచినాఁడు;
గుణగరిష్ఠుఁడు శఠకోపగురునిఁ బ్రేమ
నాశ్రయించినదాని కియ్యది ఫలమ్ము. 9

**ఫలము లేకున్న, విముఖులౌవారినైన**
**చర్యలను దిద్ది సుముఖులఁజల్పు నికర**
**వాంచితారామయుత కురుకాధినాథ!**
**నీ పదమ్ముం గీర్తింతు నేను ప్రీతి.** 10

**ప్రీతి హారిఁ గొల్చుచుండువారి పయి నెంతొ**
**వత్సలుండగు కురుకాధిపతికి దాసుఁ**
**డై మధురకవి చెప్పిన యర్థమునను**
**నమ్మువారికి పరమపదము పదము!** 11

## విష్ణుసాయుజ్యము

"ముక్తోర్చి ర్దినపూర్వపక్ష షడుదఙ్మాసాబ్ద వాతాంశుమత్
గ్లౌ విద్యుద్వరుణేంద్రధాతృమహితః సీమాంతసింధ్వాప్లుతః
శ్రీవైకుంఠ ముపేత్య నిత్య మజడం తస్మిన్ పరబ్రహ్మణః
సాయుజ్యం సమవాప్య నందతి సమం తేనైవ ధన్యః పుమాన్."

ఈ విధముగా నాచార్య ప్రపత్తిని పొగడి గురుచరణములందే సర్వ భారము నుంచి మధురకవి కాలము పుచ్చసాగెను. పరాంకుశమునియును ముప్పది యైదేండ్లా పరమాత్మను పాడిపాడి యీ యిహలోకమునే కలియుగ వైకుంఠము చేయుటకు పాటు పడి పడి యిక భగవద్విరహము సైరింపలేక వైకుంఠధామముచేరి శ్రీమన్నారాయణుని సాయుజ్యరూప మోక్షము నందిరి.

తన యాచార్యుడు పరమపదముచేరుట మధురకవికి చాల బాధ కల్గించెను. వకుళభూషణభాస్కరాస్తమయముచే కురుకానగరమేకాక యిహలోకమంతయు నంధకారబంధుర మయ్యెను. తన జీవితశేషము నెట్లో గడుపక తప్పదు కాన మధురకవి ఆళ్వారు లా చింతచెట్టుకు సమీపముననే తన యాచార్యులగు వకుళభూషణుల కొక యాలయము

నిర్మించెను. అందు వారి యర్చామూర్తిని ప్రతిష్ఠించి నిత్యోత్సవ పక్షోత్సవ మాసోత్సవాదులతో కొంతకాలము పూజించి తానుకూడ కాల క్రమమున శ్రీమహావిష్ణువు పాదారవిందములం దైక్యమగుటకు శరీరము చాలించి పరమపదము చేర నరిగెను.

## అమృత పానము

"అంబుజోదర దివ్యపాదారవింద
 చింతనామృతపానవిశేషమత్త
చిత్త మే రీతి నితరంబు చేరనేర్చు"

భక్తోత్తములారా! భాగవతకవిచూడామణియగు మనయాళ్వారుల జీవితచరిత్ర ముగింపు చేయవలసిన సమయము వచ్చినది సుమండీ! శ్రీమద్వాల్మీకిరామయణమును గూర్చిన యీ శ్లోకము సుప్రసిద్ధము.

"చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరమ్,
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్."

"శృణ్వన్ రామాయణం భక్త్యా యః పాదం పద మేవ వా,
స యాతి బ్రహ్మణః స్థానం బ్రహ్మణా పూజ్యతే సదా."

శతకోటిగ్రంథపరిమితమగు శ్రీరామచంద్రుని చరిత్రయగు శ్రీమ ద్రామాయణమునందలి యొక్కొక్క యక్షరమే మహాపాతకములను భస్మీపటలము చేయును. కాన నిట్టి రామాయణమున నొక్క పాద ముగాని పదముగాని విన్నవాడును చదివినవాడును బ్రహ్మసాయుజ్యము నంది వానిచే పూజితుడుకూడ కాగలడు.

ఒక పిల్లి పలసినన్ని పాలు త్రాగి తృప్తికాంచవచ్చునను తమితో క్షీరసాగరమును చేరినదట. కాని దాని కడుపెంత? అది త్రాగగల

పాలెన్ని? ఈ భావము విద్వత్కవికులతిలకులు శ్రీ పూతలపట్టు శ్రీరాములు రెడ్డిగా రెంత మధురముగా వర్ణించినారో!

ఉ. "బాలతనంబు గల్గు నొక పల్లి ప్రజోత్పన్నముతోడ వేడ్కపై
పాలసముద్రముం దరిసి పట్టుగ నిందిరపాలు మెుత్తముం
గ్రోలెదఁగాక యుండుఁ బసిగొన్న వితంబున రామచంద్ర శ్రీ
లాలితప్రభావజపాళం బగు దీనిని వ్రాయఁ జూచితిన్.

హరినామామృతమాధుర్యము ననుభవింప జేయుటయే ఉత్కృష్ట కావ్యముల లక్షణము, లక్ష్యము అని మాత్రమే నాపై వక్తవ్యమునకు సారాంశము.

బాలుడయినను పూర్ణబ్రహ్మజ్ఞానియు భగవత్ప్రేమార్ద్రచిత్తుడును నగు ప్రహ్లాదుడు హరినామచింతనామృతపానమును సర్వాతిశాయిగా నెట్లనుభవించి మన కన్నులకు గట్టినాడో తిలకించి ఆనందపులకితుల మగుదమా?

సీ. "మందారమకరందమాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికలఁదూగు రాయంచ చనునె! తరంగిణులకు,
లలిత రసాలపల్లవ ఖాదియై చొక్కు కోయిల సేరునే? కుటజములకు,
పూర్ణేందుచంద్రికాస్ఫురిత చకోరకం బరుగునే? సాంద్రనీహారములకు
నంబుజోదర దివ్యపాదారవింద చింతనామృతపానవిశేష మత్త
చిత్త మేరీతి నితరంబు సేరనేర్చు? వినుత గుణశీల! మాటలు వేయునేల?"

సత్యము! నారాయణచరణారవిందేందిందిరాయమానమగు మత్తచిత్తము మరొక వస్తువుపై కెట్లు మరలగలదు!

కనుకనే యీ యాళ్వార్లు భగవన్నామము నెంత సేవించినను తృప్తి కల్గింపని యమృతముగా వర్ణించినారు.

ఉ. నామెయి నీమెయిన్ గరంగి నల్గడలం జని నల్గఁ జేసితో
సామి! సుధాభిరామ! పరిపాకుల నెట్టనిపట్లమిన్నులన్
జామురటుల్లు నీవ, బలసంపద నొందు 'తిరుక్కుఱంద' నో
లామడు భాషల న్వెలసి నందుక యుండగ నిన్నుఁ గాంచితిన్.

విద్యకు ప్రధానలక్ష్య మమృతప్రాప్తియే. చూడుడీ సూక్తము --

"విద్యాం చావిద్యాం చ యస్త ద్వేదోభయం తతః,
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయామృత మశ్నుతే."

మానవుడు విద్యను. అవిద్యను రెంటిని నేర్వవలెను. అవిద్యచే విహదుఃఖాదులను పోగొట్టుకొని విద్యచే నమృతస్వరూపమయిన - అనగా నాశనములేనట్టి-మోక్షము నందవచ్చును. విద్య యనగా బ్రహ్మ విద్య - లేక మోక్షోపాయ విద్య - అని పండితార్థము. మెట్లెక్కనిదే కొండ శిఖరము నెట్లెక్కలేమో, అట్లే లౌకిక విద్య నేర్వనిదే బ్రహ్మ విద్యనుగూడ నర్థము చేసుకొనలేము. లౌకిక విద్యయే యవిద్య.

దేవతల యాహార మమృతము. దాని కొఱకే గదా దేవదానవులు భీషణ సంగ్రామ మొనర్చినది. ఎన్నో కడగండ్లపాలయిన తర్వాతగాని దేవతలకది లభింపకపోయెనుగదా! ఆ సంగ్రామమున జయించుటగాని అమృతము సంపాదించుటగాని శ్రీమహావిష్ణువు దయచేతనే దేవతలు సాధింపగల్గినారు.

చెప్పవచ్చిన దేమన నిట్టి దేవతలకు గూడ లభింపనిది సుడీ భగవద్గు ణానుభవామృతము! దేవతాశత్రువయిన బలిని త్రివిక్రముడై పాతాళమున కణగద్రొక్కి గూడ వామను డాతని యింటికి కాపలాకాచి యాతని కమృత స్వరూపమగు మోక్షము నిచ్చినాడనుట మనము మరువరాదు. హరినామామృతపానముచేసినందునే రాక్షసకుమారుడగు ప్రహ్లాదుడు భాగ

వతోత్తములలో మూర్ధన్యస్థాన మలంకరించినాడు. విను డీ శ్లోకము. దీనిలో రాక్షసవంశజు లెంతమంది విష్ణుభక్తులు గలర్తో తలపోయుదు –

ప్రహ్లాదనారదపరాశరపుండరీక వ్యాసాంబరీషశుకశౌనకభీష్మదాల్భ్యాన్,
రుక్మాంగదార్జున వశిష్ఠబిభీషణాదీనిమాన్ పరమభాగవతాన్ స్మరామి."

కాననే భగవద్భక్తుల ప్రసక్తిలో దేవదానవుల భేదము లేదు. ఉచ్చ నీచభావ మసలే లేదు. జాతిభేద మంతకంటె గణనకు రాదు.

సంతతభగవత్సాక్షాత్కారమే బ్రహ్మవిద్యకు ఫలము. ఈ భగవద్దర్శనమే అమృతసేవనమువలె బ్రహ్మానందమును సంధానించును. నేత్రాంజలులతో తదీయముఖకమలామృతపానము చేయుచు నొడలు మరచునట్టివారే నిత్యసూరులు. దీనినే వైదికసూక్త మిట్లు నిర్వచించినది –

శ్లో. "తద్విష్ణోః పరమం పదం సదా పశ్యంతి సూరయః."

ఈ నిత్యసూరులు సూర్యసమధిక తేజోజ్జ్వలులు. నిరంతరభగవత్సేవచే నొడలు మరచియుండువారు.

అసలు జీవకోటి మూడు విధములు -- నిత్యులు, ముక్తులు, బద్ధులునని. సదా దారాపుత్రవిషయాదిలంపటులై --

ప. "అచ్చపుఁ జీకటింబడి గృహవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁజర్వితచర్వణులైన వారికిన్,
జెచ్చెరఁ బుట్టునే? పరులు సెప్పిన నైన, నిజేచ్ఛనైన, నే
మిచ్చిన నైనఁ గానలకు నేగినైన, హరిప్రబోధముల్."

అను భాగవత పద్యములో వర్ణింపబడిన జీవకోటికి చెందినవారు బద్ధులు.

సదాచార్యసమాశ్రయణముచే కుటుంబజంబాలపటలము నుండి ముక్తులై పరమపదనాథుని జేర నరుగువారు ముక్తులు.

నిత్యులు ముందే చెప్పబడిరి గదా!

కాని భగవంతుని జేరు మార్గము మాత్రము సుకరము గాదు.

"క్షురస్య ధారా నిశితా దురత్యయా
దుర్గం పథస్తత్కవయో వదంతి."

కత్తివాదరవలె పదునైన దని బ్రహ్మప్రాప్తిమార్గమును తత్త్వవేదాంతవేత్తలు వర్ణించినారు.

అయిన మన కర్తవ్య మిక నెద్ది? జన్మమరణాది దుఃఖములనే ప్రసాదించు నీ తనువును నశింపజేయుమని మరణపర్యంత మీశ్వరుని ప్రార్థించుచుండుటయే!

ప. "దయ నొందందగు దాససత్తములకుం దాసుండ నాయందునన్
దయఁజేయున్ బనిఁబూని చక్రి; యుదియు న్నా యిచ్ఛపై జేయు; నీ
పయి నీ భూమినిఁ బుట్టఁ గోర మనసా! పైబాయు నజ్ఞాన మె
వ్వియు నజ్ఞంకుల గట్టిపెట్టి కొలుమా! విష్ణ్వంఘ్రి వాల్హారునన్."

నేను విష్ణువునకు దాసానుదాసుడను. నాపై చక్రి తప్పక దయ చూపును. ఇకపై నీ భూమిపై పుట్టుకోరిక నాకు లేదు. కాన జన్మ రాహిత్యమునకై యో మనసా! ఆ శ్రీమహావిష్ణువు శ్రీపాదములనే సదా భజించుచుండుమా!

మన శ్రీ కులశేఖరులు గూడ నేమన్నారో --

"దివి వా భువి వా మమాస్తు వాసో నరకే వా నరకాంతక ప్రకామమ్
అవధీరితశారదారవిందౌ చరణౌ తే మరణేఽపి చింతయామి."

నేను స్వర్గమందున్నను, భూమిపైనున్నను, నరకమందున్నను, నాకు చింతలేదు. శరత్కాల పద్మములనుగూడ తమ శోభచే తిర

స్కరించునట్టి నీ పాదపద్మములనే మరణసమయమున గూడ నేను చింతింపగల్గున ట్లనుగ్రహింపుము.

ఉ. మిమ్మున మున్నవారలును మేదిని వారలు నాసఁ జేయు సం
పన్నుఁడె వచ్చి నా మనసుఁ బట్టెను; నా కిక మచ్చెకంటి, వి
త్తోన్నతి, సత్సుతుల్ మిగుల నోరిచి నాపయిఁ గూర్మి నేయు నన్
గన్న మదంబ, మఱ్ఱితయు, నా సకలంబును నాతఁడే యగున్."

ఈ ప్రపంచములోని సర్వవస్తువులలో శ్రీమహావిష్ణువే నాకు ముఖ్యుడు. దివిమీదగాని భూమిమీదగాని యున్నవారందరు కోరునట్టి సంపత్కుమారుడే నా మనస్సు నావేశించినాడు. ఇక నాకే భార్యయేల? తుచ్ఛమగు నీ యైహికసంపదతో నా కేమి పని? ఈ బిడ్డలు రక్షక మని నమ్మనేల? మిక్కిలి కూరిమితో నన్ను కని సాకిన తల్లితో నాకు పొత్తువలదు. సర్వాధికుడగు తండ్రికూడ నా కక్కరలేదు. పైజెప్పిన వారందరి కర్తవ్యమును తానే నెరవేర్చు నా స్వామియే నన్ను సాకగలడు.

ఈ వకుళభూషణమహర్షి చరిత్ర జ్ఞానప్రదము. శ్రోతల పాపజాల
మిది విన్నంతనే పటాపంచలగును. ఈ పవిత్రచరిత్ర
విన్నవారికిని చదివినవారికిని గూడ
శ్రీ శఠకోపులే శ్రేయస్సు
లనుగ్రహింపగలరు.

"ఏతత్కారిసుతస్య దివ్యచరితం జ్ఞానైక సంవర్ధనం
శ్రోతౄణా మఘనాశనం భవహరం సంపత్కరం సర్వదమ్;
యే శృణ్వంతి పఠంతి సామ్యహృదయా ధన్యాః పరం మానవా
స్తేషాం శ్రీ శఠకోప ఏవ సతతం శ్రేయః పరం యచ్ఛతి."
"వకుళాలంకృతం శ్రీమచ్ఛఠకోపపదద్వయమ్,
అస్మత్కులధనం భోగ్యమస్తు మే మూర్ధ్ని భూషణమ్.

అస్మత్కులధనమగు శ్రీ శఠకోపుల పాదారవిందములే
నా శిరోభూషణ మగుగాక!

"దుర్లభో మానుషో దేహో దేహినాం క్షణభంగురః,
తత్రాపి దుర్లభం మన్యే వైకుంఠప్రియదర్శనమ్."

ఎనుబది నాలుగు లక్షల జీవరాసులలో మనుష్యజన్మ ముత్తమము. కాని విష్ణుభక్తి విహీనుడగు మానవుని జన్మ వ్యర్థము. విష్ణువు ప్రీతికి మాత్రమే పాత్రుడగుట చాలదు: విష్ణుభక్తుల యనుగ్రహము గూడ పొంద నర్హతగల మానవు డీ లోకమున చాల దుర్లభుడు. ఇట్టి నరజన్మము సార్థకము చేసుకొనవలెనన్న వైకుంఠ పాదయుగళీవి భూషితశిరస్కులగు వకుళభూషణుల నుతించు క్రింది సూక్తియే సదా మననీయమని తలచుచు నిక నీ యక్షర లఘుకృతికి గురుమంగళగీతిక నాలపింతమా—


"నమజ్జనస్య చిత్తభిత్తి భక్తిచిత్రతూలికా,
భవాహివీర్యభంజనే నరేంద్రమంత్రయంత్రణా,
ప్రపన్నలోక కైరవప్రసన్న చారుచంద్రికా,
శఠారి హస్తముద్రికా హఠాత్కరోతు మే తమః!"

ఈ శఠకోపుల వరదాభయహస్తముద్రిక యాశ్రితుల హృదయకుడ్యములపై భక్తికథాచిత్రముల లిఖించు తూలిక, సంసారభోగి సందష్ట జీవుల విషమడచుటలో నరేంద్రుని (విషవైద్యుని) మంత్రప్రయోగము వలె నమోఘముగా పనిచేయును. ప్రపన్నజనోత్పలముల పాలిటి కీ కవిచంద్రుడు రాకానిశాకరుడు. అట్టి యాయన యభయహస్తముద్రికయే మన యజ్ఞానాంధకారమును దూరముచేయుగాక:

యత్పదాంభోరుహధ్యాన విధ్వస్తాశేషకల్మషః,
వస్తుతా ముపయాతోఽహం యామునేయం నమామి తమ్.

రాజచ్ఛిద్రధృతోర్ధ్వపుండ్ర మనిశం, రామా  నుజాఖ్యం మునిం
కాషాయాంబర మద్దసన్నిభగళం, కాంతోపవీతస్రగుమ్,
భాషాసంస్తుతవాగ్విలాస మమలం, బద్ధాంజలిం భాస్వరం,
శ్రీవత్సాంకముఖాఖిలార్యశరణం, శ్రీభాష్యకారం భజే."

మంగళం శఠకోపాయ కలికల్మషశోషిణే,
శ్రీమత్కారితమాజాయ సదా భవతు మంగళమ్."



T.T.D. Religious Publications Series No. : 410
Price : Rs.



Printed and Published by Sri K.V.Ramanachary, I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and printed at T.T.D. Press, Tirupati.